http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

గురువారం 19 ఫిబ్రవరి 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సిందే



- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

హైదరాబాద్ : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార - మిగతా 2 లో

## మంత్రి కాన్వాయ్‌పై దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టు



- క్యాతనపల్లిలోని నివాసంలో సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు
- అడ్డుకునే ప్రయత్నం చేసిన కార్యకర్తలపై లాఠీఛార్జ్
- కాన్వాయ్‌పై దాడి కేసులో ఏ1గా బాల్క సుమన్

మంచిర్యాల : తెలంగాణ రాష్ట్ర మంత్రి వివేక్ కాన్వాయ్‌పై దాడి కేసులో బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సుమన్‌ను అరెస్టు చేసే సమయంలో కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పోలీసులు వారిపై లాఠీఛార్జ్ చేసి చెదరగొట్టారు.క్యాతనపల్లిలోని ఆయన నివాసంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసిన పోలీసులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం రామగుండం తరలించనున్నారు. వివేక్ కాన్వాయ్‌పై దాడికి సంబంధించి - మిగతా 2 లో

## తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో 61 శాతానికి పైగా సీట్లు గెలుచుకున్న బీసీలు
- రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ బీసీ అభ్యర్థుల భారీ విజయం
- ఇది బీసీల రాజకీయ చైతన్యానికి నిదర్శనమని బీసీ కమిషన్ హర్షం
- 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కేంద్రానికి కమిషన్ విజ్ఞప్తి
- ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది




హైదరాబాద్ : తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలు (బీసీలు) అద్భుతమైన విజయాన్ని నమోదు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా 61 శాతానికి పైగా వార్డులు, డివిజన్లను బీసీ అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. వాస్తవానికి మున్సిపాలిటీల్లో బీసీలకు 28.22 శాతం, కార్పొరేషన్లలో 35.25 శాతం సీట్లు మాత్రమే రిజర్వ్ చేయగా, రిజర్వేషన్లను మించి జనరల్ స్థానాల్లోనూ వారు గెలుపొందడం విశేషం.ఈ ఫలితాలపై బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, రంగూ బాలలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. బీసీ వర్గాల్లో - మిగతా 2 లో

## దద్దరిల్లిన శాసన మండలి

- పోడియం చుట్టుముట్టి వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళన
- ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ నెయ్యి సరఫరా అంశంపై వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు ఆందోళన
- పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆందోళన
- సభ్యుల ఆందోళనతో కార్యకలాపాలు ఏవీ జరగకుండానే సభ నేటికి వాయిదా
- సభలో చర్చ జరపాలంటూ ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని సభా ప్రాంగణంలోకి అడుగు పెట్టారు
- సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలు ముగిసినట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు



అమరావతి : ఇందాపూర్ డెయిరీ అంశంపై వరుసగా రెండో రోజూ శాసన మండలి దద్దరిల్లింది. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ సంస్థ నెయ్యి సరఫరా చేస్తోన్న అంశంపై చర్చించాలంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు పట్టుబట్టి ఆందోళన చేశారు. సభా కార్యకలాపాలను పూర్తిగా అడ్డుకున్నారు. వైఎస్సార్సీపీ సభ్యుల తీరుపై మంత్రులు మండిపడ్డారు. సభ్యుల ఆందోళనతో కార్యకలాపాలు ఏవీ జరగకుండానే సభ నేటికి వాయిదా పడింది.ఐదో రోజున శాసన మండలి సమావేశాలకు వైఎస్సార్సీపీ సభ్యులు ర్యాలీగా వచ్చారు. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ సంస్థ నెయ్యి సరఫరా చేసిన అంశాలపై సభలో చర్చ జరపాలంటూ ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని సభా ప్రాంగణంలోకి అడుగు పెట్టారు. సంతాప తీర్మానంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, టి రత్నాభాయి మృతిపై మండలి ఛైర్మన్ కొయ్యే మోషేను రాజు సంతాప - మిగతా 2 లో

## యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము


- విశాఖ తీరంలో ఫ్లీట్ రివ్యూ
- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రపతి ముర్ము
- ఐఎఫ్ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎంలు
- ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్
- విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష
- భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం



విశాఖపట్నం : విశాఖ సాగర తీరంలోని అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష ప్రారంభమైంది. ప్రధానంగా ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విశేష అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు పాల్గొన్నారు.వీరితో పాటు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, అడ్మిరల్ దినేశ్ త్రిపాఠి, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, తూర్పు నౌకా దళ వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాలు పాల్గొన్నారు. నేవీ సిబ్బంది గౌరవ వందనాన్ని రాష్ట్రపతి ముర్ము స్వీకరించారు.అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, - మిగతా 2 లో

## కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం

- ఆధారాలు ఉంటే అసెంబ్లీలో చర్చకు రండి
- హోం మంత్రి అనిత
- రసాయనాలతో నెయ్యి తయారు చేశారని సిట్ రిపోర్ట్ ఇచ్చిందన్న అనిత
- పింక్ డైమండ్ పేరుతో గతంలో సభా సమయం వృథా చేశారని మండిపాటు
- వారి పత్రిక రాసే విషయాలనే వైసీపీ నేతలు మాట్లాడుతుంటారని ఎద్దేవా



అమరావతి : తిరుమల లడ్డూలోని కల్తీ నెయ్యి వ్యవహారంపై సభలో చర్చించాలని వైసీపీ పట్టుబడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోం మంత్రి అనిత మాట్లాడుతూ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధమని అన్నారు. చర్చకు ఆధారాలతో రావాలని వైసీపీకి సవాల్ విసిరారు. ప్రజాహితం కోసం ఎలాంటి - మిగతా 2 లో

## భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం



- గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్
- భారత్ ఒక గొప్ప సాంకేతిక పరివర్తన దశలో ఉందన్న సుందర్ పిచాయ్
- దేశ భవిష్యత్తును ఏఐ నిర్దేశించబోతోందని ఉద్ఘాటన
- ప్రధాని మోదీతో భేటీ, ఏఐపై సహకారానికి చర్చలు
- గూగుల్ జెమినైకి భారత్ అతిపెద్ద మార్కెట్లలో ఒకటి అని వెల్లడి
- అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌తో కలిసి విద్యార్థులకు కోడింగ్, రోబోటిక్స్

ఢిల్లీ : భారతదేశం ఒక గొప్ప సాంకేతిక పరివర్తనకు నాంది పలుకుతోందని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కీలక పాత్ర పోషించనుందని ఆల్ఫాబెట్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. ప్రస్తుత దశను పరివర్తన సమయంగా ఆయన అభివర్ణించారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో - మిగతా 2 లో




## భారత్ మరో కీలక అడుగు

- దేశీయంగా హామర్ క్షిపణులు ఉత్పత్తి
- ఇప్పటికే రష్యా సహకారంతో బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తున్న ఇండియా
- తాజాగా ఫ్రాన్స్ సహకారంతో హామర్ క్షిపణులను తయారు చేయనున్న భారత్
- ఆపరేషన్ సిందూర్ సమయంలో హామర్ క్షిపణులను వాడిన ఇండియా

## నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు



ఢిల్లీ : భారతీయ బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి లండన్ పారిపోయిన వ్యాపారవేత్త విజయ్ మాల్యా తాను భారత్‌కు తిరిగి రాలేనని బాంబే హైకోర్టుకు తెలియజేశారు. తాను భారత్‌కు ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదని అన్నారు. తాను బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని, అందుకే ఎప్పుడు తిరిగి వచ్చేది చెప్పలేనని తెలిపారు.ఈ మేరకు విజయ్ మాల్యా తరఫు న్యాయవాది అమిత్ దేశాయ్ బాంబే కోర్టులో ఒక స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. మాల్యా దగ్గర యాక్టివ్ ఇండియన్ పాస్‌పోర్టు లేదని, అదేవిధంగా దేశం దాటి - మిగతా 2 లో

- బాంబే హైకోర్టుకు తెలిపిన విజయ్ మాల్యా
- బ్రిటన్ దాటి రాకుండా చట్టపరమైన ఆంక్షలు ఉన్నట్లు వెల్లడి
- ఎప్పుడు తిరిగి వస్తానో తెలియదన్న విజయ్ మాల్యా
- మాల్యా తరఫున స్టేట్‌మెంట్ సమర్పించిన

# అధికారమే పరమావధి విలువలు, సిద్ధాంతాలు జాన్తానై

**హైదరాబాద్ :** రాజకీయం అంటేనే అవకాశవాదం అని నేటి నేతలు మరోసారి నిరూపించారు. సిద్ధాంతాలు, విలువలు, పార్టీ జెండాలు.. ఇవన్నీ కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమని, అధికారం చేతికి చిక్కే అవకాశం వస్తే శత్రువునైనా కౌగిలించుకోవడానికి సిద్ధమని తెలంగాణ మున్సిపల్ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. నిన్నటి వరకు ఒకరిపై ఒకరు నిప్పులు కురిపించుకున్న నేతలు, నేడు పదవుల పంపకాల కోసం 'భాయీ-భాయీ' అంటూ చేతులు కలపడం చూస్తుంటే సామాన్య ప్రజలు విస్తుపోతున్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 36 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. దీంతో పార్టీలు తమ రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి చేతులు కలిపాయి. ఆదిలాబాద్ లో బిజెపి ఎక్కువ స్థానాలు గెలిచినప్పటికీ, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎంలు ఏకమై బిజెపిని అధికారానికి దూరం చేశాయి. కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిని ఛైర్‌పర్సన్‌గా నిలబెట్టి గెలిపించింది. భైంసా ఎంఐఎం కంచుకోట. ఇక్కడ బిజెపి రెబల్ అభ్యర్థికి కాంగ్రెస్, స్వతంత్రులు మద్దతు ఇవ్వడం గమనార్హం. నర్సాపూర్, ఆమనగల్లులో కాంగ్రెస్, బిజెపిలు పరస్పరం సహకరించుకున్నాయి. కాంగ్రెస్‌కు ఛైర్మన్ పదవి దక్కితే, బిజెపి వైస్ ఛైర్మన్ పదవిని తీసుకుంది. మెదక్ లో బిజెపి గైర్హాజరు కావడం ద్వారా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఓటుతో అక్కడ కాంగ్రెస్ పీఠాన్ని దక్కించుకుంది. ఇస్నాపూర్ లో బిజెపి ఎంపీ రఘునందన్ రావు తన ఓటును బిఆర్ఎస్ అభ్యర్థికి వేయడం ద్వారా అక్కడ బిఆర్ఎస్ గెలుపొందింది.మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో కనిపిస్తున్న దృశ్యాలు రాజకీయ దిగజారుడుతనానికి పరాకాష్టగా నిలుస్తున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఉప్పు-నిప్పులా ఉండే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కొన్ని మున్సిపాలిటీల్లో ఒకే తాటిపైకి వచ్చాయి. "బిజెపి-బిఆర్ఎస్ ఒక్కటే" అని కాంగ్రెస్ విమర్శిస్తుంటుంది, "కాంగ్రెస్-బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం" చేసుకున్నాయని బీజేపీ ఆరోపిస్తుంటుంది. కానీ, తీరా పదవుల విషయానికొచ్చేసరికి ఈ ఆరోపణలన్నీ గాలికి కొట్టుకుపోయాయి. కేవలం అధికారం దక్కించుకోవడమే పరమావధిగా, ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ ఈ 'మిలాఖత్' రాజకీయాలు సాగుతున్నాయి.ప్రతి పార్టీకి ఒక సిద్ధాంతం ఉంటుంది. ప్రజల ముందుకు వెళ్లేటప్పుడు తాము ఫలానా పార్టీకి వ్యతిరేకమని, వారి పాలన అస్తవ్యస్తమని గొంతు చించుకుని ప్రచారం చేస్తారు. కానీ, ఫలితాల తర్వాత మ్యాజిక్ ఫిగర్ రాకపోతే, వెంటనే తమ బద్ధశత్రువుతోనే జతకడతారు. ఇది ఓటర్లను మోసం చేయడమే. ప్రజలు ఒక పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి ఓటేస్తే, గెలిచిన ప్రతినిధులు మాత్రం తమ స్వప్రయోజనాల కోసం వ్యతిరేక పార్టీతో చేతులు కలపడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.ముఖ్యంగా మున్సిపల్ ఛైర్మన్ గిరి దక్కించుకోవడం వెనుక కేవలం రాజకీయ అధికారం మాత్రమే కాదు, ఆర్థిక ప్రయోజనాలు కూడా ముడిపడి ఉంటాయనేది బహిరంగ రహస్యం. భూములకు అనుమతులు, టెండర్లు, నిధుల మంజూరు వంటి అంశాల్లో చక్రం తిప్పవచ్చనే ఆశతోనే, నేతలు తమ ఆత్మగౌరవాన్ని కూడా పక్కన పెట్టి పొత్తులకు సిద్ధపడుతున్నారు.ఈ వింత పోకడల వల్ల అత్యంత నష్టపోయేది క్షేత్రస్థాయిలో ఉండే కార్యకర్తలే. ఎన్నికల సమయంలో తమ పార్టీ గెలవాలని, ప్రత్యర్థి పార్టీ నాయకులతో గొడవలకు దిగి, కేసులు వేయించుకుని, శత్రుత్వం పెంచుకునేది కార్యకర్తలు. తమ నాయకుడు గెలవగానే తమ కష్టాలు తీరుతాయని ఆశిస్తారు. కానీ, గెలిచిన తర్వాత అదే నాయకుడు ప్రత్యర్థి పార్టీ నేతతో కలిసి విందులు ఆరగిస్తూ, పదవులు పంచుకుంటూ ఉంటే.. ఆ కార్యకర్తలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక తల పట్టుకుంటున్నారు.తెలంగాణలో చోటు చేసుకుంటున్న ఈ 'అడ్డగోలు' పొత్తులు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తున్నాయి. రాజకీయ పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం సిద్ధాంతాలను వదిలేస్తే, వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పోతుంది. పదవుల కోసం పడి చచ్చే నేతలు.. తాము ఎవరి కోసం ఈ పదవులు చేపట్టామో, ఎవరి ఓట్లతో గెలిచామో ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకోవాలి. పార్టీల మధ్య ఈ అపవిత్ర కలయికలు దేశ రాజకీయాలకే చేటు. ఇప్పటికైనా నేతలు తమ వైఖరి మార్చుకోకపోతే, భవిష్యత్తులో ప్రజలే వారిని రాజకీయ తెర నుంచి తప్పించడం ఖాయం.

# దద్దరిల్లిన శాసన మండలి



**మొదటిపేజీ తరువాయి –** తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మృతి చెందిన మాజీ ఎమ్మెల్సీలకు శాసన మండలి ప్రగాఢ సంతాపం తెలిపింది. వారి మృతితో శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది.

**వారికి సంతాపం తెలిపిన మండలి :** ఐదో రోజైన ఇవాళ సభ సమావేశం కాగానే సంతాప ప్రతిపాదనను సభాపతి స్థానం నుంచి మండలి ఛైర్మన్ కొయ్యె మోషేను రాజు ప్రతిపాదించారు. మాజీ ఎమ్మెల్సీలు ఐలాపురం వెంకయ్య, టి రత్నాభాయి చేసిన సేవలను కొనియాడారు. ప్రజల కోసం తమ జీవితాన్ని అర్పించారని కీర్తించారు. అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని శాసన మండలి కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సభలో సభ్యులంతా లేచి నిలబడి 2నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు.

**తీర్మానాన్ని తిరస్కరించిన మండలి ఛైర్మన్ :** అనంతరం ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ సంస్థ నెయ్యి సరఫరా చేస్తోన్న అంశంపై చర్చించాలంటూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు రమేశ్ యాదవ్, ఆర్.జె భరత్, సిపాయి సుబ్రమణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని తిరస్కరిస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. తిరుమల కల్తీ లడ్డూపై చర్చించాలని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ చక్రవర్తి ఇచ్చిన మరో వాయిదా తీర్మానాన్నీ తిరస్కరిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.నిబంధనల ప్రకారం ప్రశ్నోత్తరాలను చేపట్టారు. సభా కార్యకలాపాలను నిలిపివేసి తాము ఇచ్చిన వాయిదా తీర్మానంపై సభలో చర్చించాలని వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనకు దిగారు. పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ ఆందోళనకు దిగారు. వైఎస్సార్సీపీ సభ్యులు పట్టువీడకుండా ఆందోళన చేయడంతో సభను కాసేపు వాయిదా వేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు.

**పోడియం వద్ద ప్లకార్డులు పట్టుకుని నినాదాలు :** అనంతరం సభ ప్రారంభం కాగానే ప్రశ్నోత్తరాలు ముగిసినట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. తరువాత సభ్యులకు ప్రత్యేక అంశాల ప్రస్తావనకు అవకాశం ఇచ్చారు. దీన్ని కూడా వైఎస్సార్సీపీ సభ్యులు అడ్డుకున్నారు. పోడియం వద్దకు వెళ్లి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఇందాపూర్ డెయిరీపై చర్చ జరపాల్సిందేనంటూ పట్టుబట్టారు.

**చర్చ లేకుండానే రేపటికి వాయిదా :** పోడియంను చుట్టుముట్టి ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. సభ్యుల ఆందోళనతో శాసన మండలి సమావేశాలు రేపటికి వాయిదా వేస్తూ ఛైర్మన్ నిర్ణయం ప్రకటించారు. వైఎస్సార్సీపీ సభ్యుల ఆందోళనతో ప్రశ్నోత్తరాలు, ప్రత్యేక ప్రస్తావన,

# యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన రాష్ట్రపతి ముర్ము

**మొదటిపేజీ తరువాయి –** డిప్యూటీ సీఎంలు ప్రయాణించారు. విశేషం ఏంటంటే ఈ కార్యక్రమంలో రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ తదితర దేశాల నుంచి వచ్చినటువంటి మొత్తం 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన మరో 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు ఒక 7 అంతర్జాతీయ యుద్ధనౌకలు సమీక్షలో పాల్గొనడం గమనార్హం. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా ఆర్కేబీచ్ ప్రధాన కేంద్రంగా సిటీ పరేడ్, నౌకాదళం విన్యాసాలు, ఫైర్, డ్రోన్ షోలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.నిబంధనలు తప్పనిసరి: విశాఖ నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అధికారులు అవకాశాన్ని కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు



చేశారు. పలు బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరిగా ఉండి తీరాలి. యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించేందుకు విశాఖ సాగర తీరానికి స్థానికులు పోటెత్తారు.నగరం నుంచి బీచ్‌రోడ్డుకు వచ్చే వారు కేజీహెచ్ డౌన్, పందిమెట్ట డౌన్, పాండురంగాపురం డౌన్‌తో పాటు వుడా పార్కు వైపు నుంచి విన్యాసాలు జరిగే ప్రాంగణానికి చేరుకోవచ్చు. ఏపీఐఐసీ స్థలం, కోస్టల్‌బ్యాటరీ, ఏయూ మైదానాల్లో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించారు. బీచ్ వరకు రాలేకపోయిన వారికి సిటీ సెంట్రల్‌పార్క్, వుడా పార్క్, సిరిపురం కూడలి గురజాడ ప్రాంగణంలో భారీ ఎల్‌ఈడీ తెరలను ఏర్పాటు చేశారు. ఆర్కేబీచ్ నుంచి సబ్‌మెరైన్ మ్యూజియం వరకు 15 బ్లాకులను ఏర్పాటు చేశారు. ఆయా బ్లాకులకు అతిథులు, నౌకాదళం ఉద్యోగులు, ఇతర ముఖ్యులకు కేటాయించారు. బ్లాకుల్లోకి వెళ్లాలంటే ప్రతి ఒక్కరికీ పాస్ తప్పనిసరి.యుద్ధనౌకల పరేడ్‌ను తిలకించిన ముర్ము: అంతర్జాతీయ యుద్ధ నౌకల సమీక్ష ప్రపంచ దేశాల మధ్య ఐక్యతకు, పరస్పర సహకారానికి అద్దం పట్టిందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. విశాఖలో నిర్వహించిన అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష -2026లో పాల్గొన్న రాష్ట్రపతి భారత నౌకాదళం ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ సమర్థంగా పని చేస్తుందని రాష్ట్రపతి ముర్ము కితాబిచ్చారు. అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్షలో భాగంగా నిర్వహించిన 71 యుద్ధనౌకల పరేడ్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తిలకించారు.

# భారత్‌కు ఇది చరిత్రాత్మక సమయం

**మొదటిపేజీ తరువాయి –** ఆయన మాట్లాడుతూ, "ఇది టెక్నాలజీ, ఆవిష్కరణలు, మరియు ఏఐ విస్తృత వినియోగంతో నడిచే ఒక దశాబ్ద కాలపు మార్పుకు నాందిలా అనిపిస్తోంది" అని పేర్కొన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా లబ్ధి పొందేందుకు భారతదేశం ప్రత్యేకమైన స్థితిలో ఉందని, అయితే ఈ అవకాశంతో పాటు గొప్ప బాధ్యత కూడా ఉంటుందని సుందర్ పిచాయ్ నొక్కిచెప్పారు. ఏఐ పరిశోధనలలో బలమైన పెట్టుబడులు పెట్టాలని, దాని వినియోగాన్ని అన్ని రంగాలకు విస్తరించాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ, ఆర్థిక వ్యవస్థలోని ప్రతి విభాగానికి ఏఐ ప్రయోజనాలు చేరేలా పునాది స్థాయి నిర్మాణం జరగాల్సిన అవశ్యకతను ఆయన వివరించారు.గత కొన్నేళ్లుగా భారత్ డిజిటల్ రంగంలో అద్భుతమైన పురోగతి సాధించిందని పిచాయ్ ప్రశంసించారు. "భారతీయ వినియోగదారులు వాయిస్ ఆధారిత, ఇమేజ్ ఆధారిత సెర్చ్‌లను ప్రపంచంలోనే అత్యధికంగా స్వీకరిస్తున్నారు. ఇది దేశ ప్రజలు కొత్త టెక్నాలజీలను ఎంత వేగంగా అందిపుచ్చుకుంటున్నారో చూపిస్తోంది," అని ఆయన తెలిపారు. గూగుల్ ఏఐ టూల్ 'జెమినై'కి భారతదేశం అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా నిలవడం, ఇక్కడి వినియోగదారులలో ఏఐ పట్ల పెరుగుతున్న ఆసక్తిని ప్రతిబింబిస్తోందని అన్నారు.ఈ పర్యటనలో భాగంగా, సుందర్ పిచాయ్ ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఏఐ రంగంలో భారత్ సాధిస్తున్న పురోగతి,



దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులు, నిపుణులతో గూగుల్ ఎలా కలిసి పనిచేయగలదనే అంశాలపై వారు చర్చించారు. ఈ భేటీపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఏఐ రంగంలో ప్రభుత్వం, గూగుల్ మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునే అవకాశాలపై పిచాయ్‌తో ఫలవంతమైన చర్చలు జరిపినట్లు తెలిపారు. భవిష్యత్ సాంకేతిక ప్రపంచానికి విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరాన్ని కూడా పిచాయ్ ప్రస్తావి ంచారు. పాఠశాల విద్యార్థులలో చిన్న వయసు నుంచే ఆవిష్కరణ, సృజనా త్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్'తో కలిసి గూగుల్ పనిచేస్తోందని, తరగతి గదుల్లోకి రోబోటిక్స్, కోడింగ్‌ను తీసుకువెళుతున్నామని

# కల్తీ నెయ్యి అంశంపై చర్చకు సిద్ధం

**మొదటిపేజీ తరువాయి –** చర్చలకైనా తాము సిద్ధమని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ ఆమె ఈ మేరకు సవాల్ విసిరారు. అది నెయ్యి కాదు, రసాయనాల మిశ్రమమని సిట్ రిపోర్ట్ తేల్చిందని తెలిపారు. చర్చకు సిద్ధమని సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని గుర్తుచేశారు.దేవుడంటే వైసీపీ సభ్యులకు భక్తిభావం లేదని... పాల సేకరణ కూడా లేని సంస్థకు నెయ్యి సరఫరా కాంట్రాక్టును ఇచ్చారని అనిత మండిపడ్డారు. ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని అన్నారు. గతంలో పింక్ డైమండ్ పేరుతో సభా సమయాన్ని వృథా చేశారని... అధికారుల విచారణలో అసలు పింక్ డైమండే లేదని తేలిందని చెప్పారు. వేంకటేశ్వరస్వామితో పెట్టుకోవద్దని హెచ్చరించారు. వైసీపీ హయాంలో వారి పత్రికకు యాడ్స్ రూపంలో రూ. 600 కోట్ల ప్రజాధనాన్ని చెల్లించారని విమర్శించారు. మదనపల్లి చిన్నారి హత్య కేసు నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని... తప్పు చేశాడు కాబట్టే మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు.

# నేను భారత్‌కు వస్తానో, రానో తెలియదు

**మొదటిపేజీ తరువాయి –** వెళ్లకుండా ఇంగ్లండ్, వేల్స్ కోర్టుల ఆంక్షలు ఉన్నాయని కోర్టుకు సమర్పించిన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు.బాంబే హైకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రశేఖర్, జస్టిస్ గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం గత వారం విజయ్ మాల్యా పిటిషన్‌పై విచారణ జరపడానికి నిరాకరించింది. తనను పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడిగా ప్రకటించడాన్ని ఆయన కోర్టులో సవాల్ చేశారు. అయితే మాల్యా భారత్‌కు రాకుండా ఈ పిటిషన్‌పై విచారణ జరపలేమని స్పష్టం చేసింది. మాల్యాకు భారత్‌కు తిరిగొచ్చే ఉద్దేశం ఉందా, లేదా? అని ప్రశ్నించింది.ఈ నేపథ్యంలో మాల్యా తన తరఫు న్యాయవాది ద్వారా బాంబే హైకోర్టులో తాజా స్టేట్‌మెంట్‌ను సమర్పించారు. ఈ పిటిషన్ విచారణ జరిపేందుకు ఆయన ప్రత్యక్షంగా కోర్టుకు హాజరు కావాల్సిన అవసరం లేదంటూ అమిత్ దేశాయ్ కోర్టులో వాదనలు వినిపించారు.

# తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన బీసీలు!

**మొదటిపేజీ తరువాయి –** పెరిగిన రాజకీయ చైతన్యానికి ఈ విజయాలే స్పష్టమైన నిదర్శనమని వారు అభిప్రాయపడ్డారు. ఫిబ్రవరి 11న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు ఎన్నికలు జరగ్గా, 13న ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే.ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లోనూ బీసీ అభ్యర్థులు 52.75 శాతం సీట్లు గెలుచుకున్నారని కమిషన్ గుర్తుచేసింది. ఇదే స్ఫూర్తితో త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీసీలు భారీ సంఖ్యలో గెలుపొందుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్ర జనాభాలో బీసీలు 56.33 శాతం ఉన్నారని, వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ చేసిన చట్టం కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉందని కమిషన్ పేర్కొంది. ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కొందరు కోర్టులను ఆశ్రయించారని తెలిపింది. తాజా ఎన్నికల ఫలితాల నేపథ్యంలో, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చి వెంటనే ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీసీ కమిషన్ కోరింది. అలాగే, కోర్టులో కేసులు వేసిన వారు వాటిని ఉపసంహరించుకుని బీసీల అభ్యున్నతికి సహకరించాలని విజ్ఞప్తి చేసింది.

# మంత్రి కాన్వాయ్‌పై దాడి కేసులో బాల్క సుమన్ అరెస్టు

**మొదటిపేజీ తరువాయి –** రామకృష్ణాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏ1గా బాల్క



సుమన్, ఏ2గా మూల రాజిరెడ్డి పేర్లను పేర్కొన్నారు.మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీకి మెజారిటీ స్థానాలు వచ్చాయి. అయితే కుట్రపూరితంగా మున్సిపాలిటీని చేజిక్కిం చుకోవాలని మంత్రి వివేక్ ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ క్రమంలో ఈరోజు బీఆర్ఎస్, సీపీఐ పార్టీలు కలిసి క్యాతనపల్లి బంద్ కు పిలుపునిచ్చాయి.

# భారత్ మరో కీలక అడుగు




**మొదటిపేజీ తరువాయి –** మేకిన్ ఇండియాలో భాగంగా ఇప్పటికే భారత్ పలు ఆయుధాలను సొంతంగా తయారు చేస్తోంది. రష్యా సమన్వయంతో శత్రు భయంకర బ్రహ్మోస్ క్షిపణులను ఇండియా తయారు చేస్తున్న సంగతి తెలిసిందే. ఆపరేషన్ సిందూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణుల దెబ్బకు పాకిస్థాన్ బెంబేలెత్తిపోయింది. తాజాగా భారత్ మరో ముందడుకు వేసింది. ఫ్రాన్స్ సహకారంతో భారత్ దేశీయంగా హ్యామర్ క్షిపణులను తయారు చేయనుంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ ప్రధాని మోదీ మధ్య దీనిపై ఒప్పందం కుదిరింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఈ క్షిపణులను కూడా వాడింది.ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వద్ద ఉన్న రఫేల్ యుద్ధ విమానాలకు హామర్ క్షిపణులను జోడించారు. తాజాగా మరో 114 రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుకు భారత రక్షణ శాఖ క్లియరెన్స్ ఇచ్చింది. వీటికోసం అదనంగా హామర్ క్షిపణులు తయారు చేయాల్సి ఉంటుంది. స్వదేశీ తేజస్ యుద్ధ విమానాలకు కూడా ఈ క్షిపణులను జోడించనున్నారు. ఈ క్షిపణులను ఇండియాలోనే భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్), ఫ్రాన్స్‌కు చెందిన సఫ్రాన్ సంయుక్తంగా తయారు చేయనున్నాయి.మేకిన్ ఇండియా ప్రోగ్రామ్‌లో భాగంగా హెచ్125 హెలికాప్టర్లను కూడా స్వదేశీయంగా తయారు చేయనున్నారు. కర్నాటకలోని వేమగాల్‌లో అసెంబ్లింగ్ యూనిట్ ప్రారంభమైంది. వీటిని యూరోపియన్ సంస్థ ఎయిర్‌బస్, భారత్‌కు చెందిన టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంయుక్తంగా తయారు చేస్తున్నాయి. ఇది లైట్ మల్టీరోల్ హెలికాప్టర్. మంచు పర్వతాల్లోనూ సత్తా చాటుతుంది. హిమాలయాల్లోని ఎవరెస్ట్ శిఖరం అంత ఎత్తు వరకు ఇది ఎగరగలదు.

# కాంగ్రెస్ నేతలు వడ్డీతో సహా చెల్లించుకోవాల్సిందే



**మొదటిపేజీ తరువాయి –** దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు.ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు.కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలోని రైతు సోదరులకు శుభవార్త!

**వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా శనగల కొనుగోళ్ల ప్రారంభం**

**94,500 మెట్రిక్ టన్నుల శనగల సేకరణకు నిర్ణయం**

**రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ**

కొనుగోలు చేసిన 15 రోజుల్లోనే రైతు ఖాతాల్లోకి నగదు జమ

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యంగా 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి శనగల కొనుగోలు ప్రక్రియను నేటి నుంచే రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ ధరల మద్దతు పథకం కింద మొత్తం 94,500 మెట్రిక్ టన్నుల శనగలను సేకరించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ



నుంచి ఆదేశాలు అందాయని, నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్ సంస్థల ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతాయని వివరించారు.కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో సీఎం యాప్ ద్వారా పర్యవేక్షణ ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీలు ఈ సేకరణను పర్యవేక్షిస్తాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, మార్కెటింగ్, ఏపీ మార్క్‌ఫెడ్ వంటి అన్ని శాఖల సమన్వయంతో నేరుగా రైతు సేవా కేంద్రాల్లోనే కొనుగోళ్లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రక్రియలో పూర్తి పారదర్శకత కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వయం సహాయక సంఘాలను కూడా భాగస్వామ్యం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 3.25 లక్షల హెక్టార్లలో శనగ పంట సాగు చేయగా, దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట కొనుగోలు చేసిన 15 రోజుల లోపే డబ్బులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమానికి తమ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

# భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ భూటాన్ ప్రధానితో మోదీ చర్చలు



దిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' వేళ ప్రధాని నరేంద్ర మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. కృత్రిమ మేధ శక్తిని ప్రపంచ క్షేమం కోసం ఎలా వినియోగించుకోవాలనే అంశం సహా పలు విషయాలపై ఇరువురు నేతల మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయి. ఈ భేటీ అనంతరం ప్రధాని మోదీ స్పందించారు. తమ భేటీ అద్భుతంగా జరిగిందని మోదీ పేర్కొన్నారు. భారత్-భూటాన్ స్నేహబంధం కొత్త రంగాలకు విస్తరిస్తూనే ఉందని పేర్కొన్నారు. ఈ మేరకు మోదీ ట్వీట్ చేశారు. భారత్- భూటాన్ మధ్య ఉన్న పరస్పర విశ్వాసం, సద్భావన మన భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేరుస్తాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

"ప్రధాని షెరింగ్ తోబ్గేతో జరిగిన సమావేశం బాగా జరిగింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ప్రపంచ మలు కోసం, సుస్థిరత కోసం ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశంపై చర్చించాం. పరస్పర విశ్వాసం, సద్భావన, ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న సన్నిహిత సంబంధాలతో పాతుకుపోయిన భారత్-భూటాన్ స్నేహం, మన భాగస్వామ్యాన్ని కొత్త రంగాల వైపు నడిపిస్తూనే ఉంది" అని ప్రధాని మోదీ తెలిపారు.

ఇరువురు నేతల భేటీపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ప్రధాని మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేలు ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, సహకారంలో సాధించిన పురోగతిని సమీక్షించారని పేర్కొన్నారు. "భారత్-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ, భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇంధనం, కనెక్టివిటీ, అభివృద్ధి భాగస్వామ్యం, ప్రజల మధ్య సంబంధాల రంగాలలో ద్వైపాక్షిక సహకార పురోగతిని ఇద్దరు నాయకులు సమీక్షించారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి అంగీకరించారు. విశ్వాసం, సద్భావన, పరస్పర గౌరవంతో కూడిన భారత్-భూటాన్ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసేందుకు కృషి చేస్తామని ఇద్దరు నాయకులు పునరుద్ఘాటించారు" అని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

అంతకుముందు భూటాన్ ప్రధాని తోబ్గే బుధవారం ఉదయం దిల్లీ చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా స్పందించారు. దిల్లీలో జరుగుతున్న 'భారత్-ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' కోసం వచ్చిన భూటాన్ ప్రధాని షెరింగ్ తోబ్గేకు స్వాగతమని పేర్కొన్నారు.

**గ్లోబల్ సౌత్ దేశాల్లో మొదటిది**

'భారత్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' ఫిబ్రవరి 20 వరకు దిల్లీలోని భారత్ మండపంలో జరగనుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)పై ప్రపంచవ్యాప్త చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి ఈ సదస్సు దోహదపడనుంది. గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న దేశాల కూటమి) నిర్వహించిన మొట్టమొదటి గ్లోబల్ ఏఐ సదస్సు ఇదే కావడం గమనార్హం. "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" అనే నినాదంతో ఈ సమ్మిట్ నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో 110 కంటే ఎక్కువ దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి. ఇందులో దాదాపు 20 దేశాల అధినేతలు, 45 దేశాల నుంచి మంత్రులు హాజరయ్యారు. భూటాన్ ప్రధానితో పాటు ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వా, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఏఐ సామ్ ఆల్ట్‌మాన్ వంటి టెక్ దిగ్గజాలు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు.

**కజకిస్థాన్ ప్రధానితో మోదీ భేటీకి**

వాణిజ్యం, ఇంధనం, కీలక ఖనిజాలు, రేర్ ఎర్త్స్, రక్షణ రంగాలలో కజకిస్థాన్‌తో ద్వైపాక్షిక సహకారానికి అపారమైన అవకాశాలు ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' సందర్భంగా కజకిస్థాన్ ప్రధాని ఓల్జాస్ బెక్టెనోవ్‌తో సమావేశమైన అనంతరం, మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. "ప్రధానమంత్రి ఓల్జాస్ బెక్టెనోవ్, నేను ఈ రోజు సమావేశమయ్యాము. ఆయన పర్యటన భారత్-కజకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది" అని మోదీ అన్నారు.

# భారతీయ విద్యార్థులకు వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం



భారతీయ విద్యార్థుల కోసం వీసా, అడ్మిషన్ ప్రక్రియను సరళీకరిస్తామని, అలాగే ఫ్రాన్స్‌లో ఇంగ్లీష్ మాధ్యమంలో బోధించే కోర్సులను పెంచుతామని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ బుధవారం ప్రకటించారు. 2030 నాటికి భారతీయ విద్యార్థుల సంఖ్యను ఏడాదికి 30,000కు పెంచడమే లక్ష్యంగా ప్రధాని మోదీతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. భారతదేశ పర్యటనలో భాగంగా బుధవారం దిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి విద్య, శాస్త్రీయ సమావేశంలో మేక్రాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ క్యాంపస్‌లో ఆయన ప్రసంగిస్తూ, భారత్-ఫ్రాన్స్ విద్యా సంబంధాలను బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

**వీసా ప్రక్రియను సులభతరం చేస్తాం!**

"రానున్న రోజుల్లో మా దేశానికి ఎక్కువ మంది భారతీయ విద్యార్థులను స్వాగతించాలనుకుంటున్నాం. అదేవిధంగా, అలాగే ఫ్రెంచ్ విద్యార్థులు కూడా భారత్‌కు రావాలని కోరుకుంటున్నాం. ప్రస్తుతానికి భారత్? నుంచి ఫ్రాన్స్ వచ్చే విద్యార్థుల సంఖ్య 10వేలుగా ఉంది. ఆ సంఖ్యను 2030 నాటికి 30,000లకు పెంచాలని ప్రధాని మోదీతో చర్చించా. ఫ్రాన్స్ వైపు నుంచి మేము అడ్మిషన్ల ప్రక్రియను, వీసా విధానాన్ని సరళీకరిస్తాం. విద్యార్థుల అంచనాలకు అనుగుణంగా ఈ ప్రక్రియలను మరింత ఆచరణాత్మకంగా మారుస్తాం"

**ఇండో-ఫ్రెంచ్ క్యాంపస్**

ఈ సందర్భంగా మేక్రాన్?, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డాతో కలిసి, 'ఇండో-ఫ్రెంచ్ క్యాంపస్ ఆన్ ఏఐ ఇన్ గ్లోబల్ హెల్త్'ను ప్రారంభించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఆరోగ్య సంరక్షణ పరిష్కారాలలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని పెంచడానికి ఇది ఒక కీలక అడుగు అని అన్నారు. పరిశోధన, ఆవిష్కరణ, సామర్థ్య నిర్మాణం వంటి అంశాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా పెంచడం దీని లక్ష్యమని పేర్కొన్నారు.

**ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు**

మరోవైపు, ఫ్రాన్స్‌లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారత విద్యార్థులకు ప్రపంచ స్థాయి బోధన, ప్రముఖ పరిశోధనా కేంద్రాల్లో పని చేసే అవకాశాలు లభిస్తాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. ఆంగ్ల మాధ్యమంలో విభిన్న కోర్సులు అందుబాటులో ఉంచడం ద్వారా భారత విద్యార్థులకు మరింత సౌలభ్యం కల్పిస్తామని వెల్లడించారు. 'మా వద్ద ఉత్తమ బోధన సదుపాయాలు ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. విద్యార్థులకు ఆంగ్లంలో కూడా విభిన్న కోర్సులు అందిస్తాం. ఉన్నత విద్యలో వారికి అవసరమైన అన్ని విధాల సహాయ, సహకారాలను అందిస్తాం' అని మెక్రాన్ హామీ ఇచ్చారు.

**భారత్‌తో రక్షణ సంబంధాలపై మెక్రాన్ వ్యాఖ్యలుర**

అంతకుముందు, కూడా ముంబయిలో జరిగిన 'ఇండియా-ఫ్రాన్స్ ఇన్నోవేషన్ ఫోరమ్'లో మెక్రాన్? మాట్లాడారు. భారత్‌తో కుదిరిన రక్షణ సంబంధాలపై ఆయన ప్రస్తావించారు. 'నేల, నీరు ఆకాశం ఇలా అంతటా భారత్- ఫ్రాన్స్ ఒకరికొకరం సహాయ సహకారాలు అందించుకుంటున్నాం' అని మెక్రాన్? తెలిపారు. ఆవిష్కరణ అంటే కేవలం సాంకేతిక రంగంలో సాధించే విజయాలు మాత్రమే కాదని, అవి సామాన్య ప్రజల ప్రయోజనం కోసం, వారి జీవితాలను మెరుగుపరచడం కోసమని మెక్రాన్? పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మరింత ఆరోగ్యకరంగా, సురక్షితంగా మార్చడం కోసం అనే ఉమ్మడి ఆకాంక్షతోనే ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. అదేవిధంగా, రక్షణ రంగంలో సాంకేతిక బదిలీపై కూడా ఫ్రాన్స్ అధ్యక్షుడు కీలక వ్యాఖ్యలు చేశారు. జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధ విమానాలు, ఐదో తరం విమానాల ఇంజన్లు ఇలా అనేక రంగాలలో ఫ్రాన్స భారత్‌తో కలిసి పని చేస్తోందని మెక్రాన్? తెలిపారు. ఈ రంగంలో సాంకేతిక బదిలీని తాము కూడా విశ్వసిస్తామని చెప్పారు. అయితే, ఈ అంశాన్ని తాము కూడా ప్రతిపాదించినట్లు మెక్రాన్ చెప్పుకొచ్చారు. దీంతో పాటు అంతరిక్ష రంగం వంటి అనేక ఇతర విషయాల్లోనూ ఇరు దేశాల మధ్య సంబంధాలు కొన్నేళ్లుగా అద్భుతంగా కొనసాగుతున్నాయని మెక్రాన్? చెప్పుకొచ్చారు. అందుకే జులైలో తాము ఫ్రాన్స్‌లో నిర్వహించబోయే అంతరిక్ష రంగ సదస్సుకు భారత్‌ను ఆహ్వానించామని ఆయన స్పష్టం చేశారు.

# అమెరికా-భారత్ మధ్య 'సబ్‌సీ కేబుల్ రూట్'

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారత్ అసాధారణ రీతిలో ముందుకు సాగుతోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు. భారత ఏఐ పరివర్తనలో భాగస్వామ్యం అయ్యేందుకు తమ సంస్థ కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. దిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐ హబ్‌ను గుర్తుచేసిన ఆయన, తాజాగా అమెరికా-భారత్ పేరిట కొత్త కార్యక్రమాన్ని ప్రకటించారు. అమెరికా, భారత్, దక్షిణ గోళార్ధంలోని పలు ప్రాంతాల మధ్య ఏఐ కనెక్టివిటీని మెరుగుపర్చడానికి కొత్త సబ్‌సీ కేబుల్ రూట్‌లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. మరోవైపు ఏఐ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నట్లు వివరించిన సుందర్ పిచాయ్, ఆరోగ్య సంరక్షణ డయాగ్నస్టిక్స్‌ను మెరుగుపర్చడం నుంచి రైతులకు రియల్-టైమ్ అలర్ట్‌లు అందించడం వరకు అనేక సమస్యలను పరిష్కరించవచ్చని వివరించారు. భారతదేశ వైవిధ్యం, భాషా వ్యవస్థ, బలమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నూతన ఆవిష్కరణలకు శక్తిమంతమైన పునాది అని పేర్కొన్నారు. ఏఐ వినియోగంలో విశ్వాసం, భద్రత, సమగ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సుందర్ పిచాయ్ సూచించారు. సాంకేతికత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా, ఫలితాల ఆధారంగా ఉన్నప్పుడు ప్రజలకు నమ్మకం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

**జెమినైకు భారత్ పెద్ద మార్కెట్**

"పర్సనల్ ఏఐ అసిస్టెంట్ జెమినై యాప్ ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో భారత్ మా అతిపెద్ద మార్కెట్లలో ఒకటి. భారత్‌లో మాట్లాడే పది భాషల్లో ఇది అందుబాటులో ఉంది. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గత ఏడాది 15బిలియన్ డాలర్లతో విశాఖలో ఏఐ హబ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించాం. ఇది గిగావాట్ స్థాయిలో ఏర్పాటవుతుంది. సరికొత్త ప్రపంచస్థాయి సముద్ర కేబుల్ గేట్‌గా మారుతుంది. కటింగ్ ఎడ్జ్ ఏఐ ద్వారా ఉద్యోగాలు వస్తాయి. భారత్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు, వ్యాపారవేత్తలకు సేవలు అందుతాయి" అని తెలిపారు.

**అమెరికా-భారత్ మధ్య సముద్ర కేబుల్**

"ఇవాళ కొత్తగా భారత్-అమెరికా అనుసంధాన ప్రక్రియను ప్రకటిస్తున్నాం. దీని ద్వారా సరికొత్త సముద్ర కేబుల్స్ వస్తాయి. అమెరికా-భారత్ మధ్య ఏఐ అనుసంధానం మరింత పెరుగుతుంది.

## 78 ఏళ్ల వయస్సులో పీజీ కంప్లీట్ గోల్డ్ మెడలిస్ట్ సుష్మ సక్సెస్ స్టోరీ ఇదే!



చదువుకు వయసుతో సంబంధం లేదని ఆమె నిరూపించారు. ఆసక్తి ఉండాలే కానీ ఏ వయసులోనైనా చదువును కొనసాగించొచ్చని సుష్మ మోఘే రుజువు చేశారు. ఆమె 78 ఏళ్ల వయసులో మరాఠీ సాహిత్యంలో పీజీ కోర్సును పూర్తి చేసి సరికొత్త రికార్డును నెలకొల్పారు. నామమాత్రంగా కోర్సును చేయడం కాదు, ఫైనల్ ఎగ్జామ్స్‌లో మొదటి ర్యాంకును సాధించి అందరితో సుష్మ శభాష్ అనిపించుకున్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ ఆమెకు గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. సుష్మ మోఘే మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగర వాస్తవ్యురాలు. ఆమె తొలుత మ్యూజిక్ కోర్సులో డిగ్రీ చేశారు. అనంతరం ఒక కేంద్ర ప్రభుత్వ స్కూలులో మ్యూజిక్ టీచర్‌గా ఉద్యోగం వచ్చింది. ఈ ఉద్యోగం చేస్తూనే, కెమిస్ట్రీలో పీజీ కోర్సును పూర్తి చేశారు. ఇక మ్యూజిక్ టీచర్‌గా దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సుష్మ సేవలు అందించారు. 2000 సంవత్సరంలో రిటైరయ్యాక, పుస్తకాలను హిందీ నుంచి మరాఠీ భాషలోకి అనువాదం చేసే పనులను చేశారు. సొంతంగా వివిధ టాపిక్స్‌పై పుస్తకాలను రాశారు. ఆమె రాసిన పుస్తకాల్లో దాదాపు డజను వరకు ఇప్పటికే పబ్లిష్ అయ్యాయి.

**76 ఏళ్ల వయసులో పీజీ అడ్మిషన్**

మరాఠీ సాహిత్యం, రచనలు అంటే సుష్మకు మహా ఇష్టం. అందుకే రెండేళ్ల క్రితం ఇండోర్‌లో ఉన్న దేవి అహల్య విశ్వవిద్యాలయంలో మరాఠీ సాహిత్యం పీజీ కోర్సులో జాయిన్ అయ్యారు. వాస్తవానికి పీజీ కోర్సుల్లో జాయిన్ కావడానికి గతంలో ఏజ్ లిమిట్ ఉండేది. కానీ కొన్నేళ్ల క్రితమే వయో పరిమితి నిబంధనను యూనివర్సిటీ తొలగించింది. దీంతో 76 ఏళ్ల సుష్మ పీజీ కోర్సులో జాయిన్ అయ్యేందుకు లైన్ క్లియర్ అయ్యింది. ఇంత పెద్ద ఏజ్‌లో దేవి అహల్య విశ్వవిద్యాలయంలో పీజీలో చేరిన తొలి వ్యక్తిగా ఆమె రికార్డును సొంతం చేసుకున్నారు.

**పీజీ ఫైనలియర్‌లో 1వ ర్యాంకు**

పీజీ చేయాలనే సుష్మ నిర్ణయానికి కుటుంబంలోని వాళ్లంతా మద్దతు పలికారు. తప్పకుండా జాయిన్ కండి అంటూ ప్రోత్సహించారు. పీజీలో చేరిన సుష్మ, ఇంట్లో తీరిక దొరికినప్పుడల్లా పుస్తకాలు చదవడానికే సమయాన్ని కేటాయించారు. కట్ చేస్తే, రెండేళ్ల పీజీ కోర్సు పూర్తయింది. మరాఠీ సాహిత్యం పీజీ కోర్సు ఫైనలియర్ పరీక్షల్లో అత్యధిక మార్కులతో 1వ ర్యాంకును ఆమె సాధించారు. యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్‌గా ఎంపికయ్యారు.

**కొడుకు, కోడలు, మనవడి సమక్షంలో గోల్డ్ మెడల్**

తాజాగా మంగళవారం రోజు (ఫిబ్రవరి 17న) దేవి అహల్యా విశ్వవిద్యాలయంలో ఘనంగా స్నాతకోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుష్మను యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ మంగూభాయ్ పటేల్ గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. 78 ఏళ్ల సుష్మ గోల్డ్ మెడల్‌ను అందుకోవడాన్ని చూసి, సభికులు కరతాళ ధ్వనులను మోగించారు. విశేషం ఏమిటంటే, ఈ కార్యక్రమానికి సుష్మ కుమారుడు గౌరవ్, కోడలు పూజ, మనవడు రేయాంశ్ కూడా హాజరయ్యారు. ఏడు పదుల వయసులో సుష్మ సాధించిన ఘన విజయాన్ని చూసి వాళ్లు పొంగిపోయారు. "నాకు మొదటి నుంచే చదవడం, రాయడం అంటే ఆసక్తి. చదువుకు వయసుతో సంబంధమే లేదు. తొలుత నేను మ్యూజిక్‌లో డిగ్రీ చేశాను. అనంతరం టీచర్ జాబ్ చేస్తూ కెమిస్ట్రీలో పీజీ చేశాను. ఇప్పుడు మరాఠీ సాహిత్యంలో పీజీని పూర్తి చేశాను. నాకు గోల్డ్ మెడల్ వచ్చింది. చాలా కష్టపడి పీజీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. ఈక్రమంలో నా ఫ్యామిలీ చాలా బాగా సహకరించింది" అని సుష్మ మోఘే తెలిపారు. "మా అత్తమ్మను చదువులో మేమంతా ప్రోత్సహించాం. ఆమె ఇటీవలే పీజీ కోర్సులో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. పీజీ పరీక్షలకు మా అత్తమ్మ సీరియస్‌గా ప్రిపేర్ అయ్యారు. చదువుకు వయసుతో సంబంధం లేదని ఆమె నిరూపించారు" అని సుష్మ కోడలు పూజా మోఘె తెలిపారు. "ఫిబ్రవరి 17న మా యూనివర్సిటీకి చెందిన 230 మంది విద్యార్థులకు డాక్టరేట్లను గవర్నర్ మంగూభాయ్ పటేల్ ప్రదానం చేశారు. వీరిలో 130 మంది విద్యార్థులకు గోల్డ్, సిల్వర్ మెడల్స్ లభించాయి. ఈ విద్యార్థులకు పీజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు వచ్చాయి" అని ఇండోర్‌లోని దేవి అహల్యా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ రాకేశ్ సింఘాయ్ తెలిపారు. రిటైర్మెంట్ తర్వాత కూడా సీనియర్ సిటిజెన్లకు లైఫ్ ఉంటుందనే గొప్ప సందేశాన్ని సుష్మ ఈ సమాజానికి అందించారు. జీవితంలోని ఏ దశలోనైనా చదువును కొనసాగించొచ్చని ఆమె రుజువు చేశారు.

## రెండో వారంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు నోటిఫికేషన్

**న్యూఢిల్లీ :** ఈ ఏడాదిలో జరగబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై ఈసీ కసరత్తు ప్రారంభించింది. బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరీల్లో ఇప్పటికే ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టింది. ఈ ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఎస్ఐఆర్‌పై ఓ పక్క విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. దీంతో ఎన్నికల తేదీలను మార్చి రెండో వారంలో ప్రకటించి, చివరి వారంలో నోటిఫికేషన్ విడుదల చేస్తుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈసీ అధికారులు.. ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. వచ్చే ఏప్రిల్‌లో బెంగాల్, తమిళనాడు శాసనసభకు ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. వీటితో పాటు కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు పోలింగ్ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మార్చి రెండో వారంలో షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపాయి. ఇక, ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు ఇప్పటికే ఈసీ అధికారులు పర్యటనలు ప్రారంభించారు. ప్రస్తుతం ఈసీ బృందం అసోంలో పర్యటిస్తుంది.తమిళనాడు, కేరళ, పశ్చిమ్ బెంగాల్ అసెంబ్లీలకు మే నెలలోనూ.. పుదుచ్చేరి శాసనసభకు జూన్ 15తో గడువు ముగియనుంది. ఇక, ఎన్నికల జరగనున్న రాష్ట్రాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ చివర దశకు చేరుకుంది. ఫిబ్రవరి 10 అసోం, ఫిబ్రవరి 14న పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రచురించిన సంగతి తెలిసిందే. తమిళనాడులో మంగళవారం తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. ఫిబ్రవరి 21న కేరళ, 28న పశ్చిమ బెంగాల్లో తుది జాబితాలు విడుదలవుతాయి. కానీ, ఎస్ఐఆర్‌పై తమిళనాడు, బెంగాల్‌లో రగడ కొనసాగుతోంది.తమిళనాడులో డిసెంబరు 19న విడుదల చేసిన ముసాయిదాలో 97 లక్షల మంది పేర్లను తొలగించారు. బెంగాల్‌లోనూ 58 లక్షల మంది పేర్లు డిలీట్ చేశారు. ఇప్పటికే దీనిపై తమిళనాడు, బెంగాల్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, మమతా బెనర్జీలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై దీదీ యుద్ధం ప్రకటించారు. సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసి, స్వయంగా మమతా బెనర్జీ వాదనలు వినిపించడం గమనార్హం.బెంగాల్‌లో వరుసగా మూడుసార్లు అధికారం చేపట్టిన మమతా బెనర్జీ.. నాలుగోసారి హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమయ్యారు. అటు, బీజేపీ సైతం అధికారం కోసం విశ్వప్రయత్నాలు చేస్తోంది. గత ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామని భారీ అంచనాలు పెట్టుకుంది. ఎగ్జిట్ పోల్స్‌లో ఆ పార్టీకే అనుకూలమని వచ్చినా.. ఫలితాలు మాత్రం కమలానికి షాకిచ్చాయి. 2011, 2016కు మించి భారీ మెజార్టీతో మమతా బెనర్జీ గెలిచారు. ఈసారి ఏ అవకాశం వదులుకోరాదని కమలనాథులు గట్టిగానే కృషిచేస్తున్నారు.

## సంపాదకీయం

# అప్పుల భారతం!

సామాన్యులే కాకుండా ప్రభుత్వాలు సైతం అప్పులు లేనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ అప్పులు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థల గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. సామాజిక సంక్షేమం, మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక స్థిరత్వం కోసం దేశాలు చేస్తున్న అప్పులు అతి భారీ స్థాయికి చేరుకున్నాయి. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించిన గణాంకాల ప్రకారం 2025 -26 నాటికి ప్రపంచ దేశాల మొత్తం అప్పు 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ఈ అప్పులో ఎక్కువ భాగం ప్రపంచంలోని అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు కలిగిన దేశాల్లోనే ఉండటం గమనార్హం. భారత దేశంలోని 147 కోట్ల మంది జనాభాలో ప్రతి ఒక్కరిపై ఈ ఏడాది మార్చి నాటికి రూ. 1.34 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇది వ్యక్తులు చేసిన అప్పు కాదు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రుణం. అయినప్పటికీ ఈ సంవత్సరం (2026- 27) కూడా భారీ స్థాయిలో అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 14.61 లక్షల కోట్ల అప్పులు చేసిన కేంద్రం రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. 17.2 లక్షల కోట్ల రుణాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రుణం కంటే 17 శాతం ఎక్కువ కావడం గమనార్హం. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం రూ. 53.47 లక్షల కోట్లకు బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఇందులో మార్కెట్ నుంచి మొత్తం రూ. 17.2 లక్షల కోట్లు సేకరించాల్సి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 2025 -26 సవరించిన అంచనాల ప్రకారం కేంద్రం మొత్తం అప్పులు రూ. 1,97,18,016 కోట్లు కాగా, మార్చి 2027 నాటికి ఇది 2,14,82,050 కోట్లకు చేరనుంది. ఇక జిడిపిలో రుణ నిష్పత్తిని 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ నిష్పత్తి 2019లో 50 శాతంలోపే ఉంది. ఇక తాజా బడ్జెట్‌లో జిడిపిలో ద్రవ్యలోటును 4.3 శాతంగా అంచనా వేశారు. 2026 మార్చి 31 నాటికి భారత కేంద్ర ప్రభుత్వం మొత్తం అప్పులు రూ. 197.18 లక్షల కోట్లకు (సుమారు ట్రిలియన్ డాలర్లు) చేరుకుంటాయని అంచనా వేశారు. ఇది 2026 -27 ఆర్థిక సంవత్సరంలో మరింత పెరిగి రూ. 214.82 లక్షల కోట్లకు చేరవచ్చని బడ్జెట్ అంచనాలు వెల్లడిస్తున్నాయి. 2024లో దేశం మొత్తం అప్పు సుమారు 85 శాతంగా ఉంది. 2026 వరకు దేశవ్యాప్త అప్పుల వివరాలు: కేంద్ర అప్పులు: 2025 -26 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ అప్పులు రూ. 197.18 లక్షల కోట్ల నుండి 2026 -27 నాటికి రూ. 214.82 లక్షల కోట్లకు పెరుగుతాయని అంచనా. వ్యక్తిగత భారం: 2026 ప్రారంభానికి, దేశంలోని ప్రతి పౌరుడిపై సుమారు రూ. 1.34 లక్షల అప్పు (కేంద్రం చేసిన రుణాల ప్రకారం) ఉంది. ద్రవ్యలోటు : 2025- 26లో 4.4 శాతం , 2026 -27 నాటికి 4.3 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2025- 26 నాటికి 56.1 శాతంగా ఉన్న అప్పు- జిడిపి నిష్పత్తిని, 2026- 27 నాటికి 55.6 శాతంకి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2026 మార్చి నాటికి అప్పులు రూ. 7.46 లక్షల కోట్లకు చేరవచ్చనిఅంచనా వేశారు. 2026 -27 బడ్జెట్‌లో గ్రాస్ మార్కెట్ బోరోయింగ్ (మొత్తం అప్పులు) సుమారు రూ. 17.2 లక్షల కోట్లుగా అంచనా వేశారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి తాజా గణాంకాల ప్రకారం ప్రపంచ దేశాల మొత్తం అప్పు 2025 నాటికి 110.9 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. అత్యధిక అప్పులు ఉన్న దేశాల జాబితాలో అమెరికా తొలి స్థానంలో ఉండగా, భారతదేశం 3.36 ట్రిలియన్ డాలర్లతో ఏడవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రుణ నిష్పత్తిని 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచంలోనే అత్యధిక ప్రభుత్వ అప్పులు ఉన్న దేశంగా అగ్రరాజ్యం అమెరికా తొలి స్థానంలో నిలిచింది. అమెరికా మొత్తం అప్పు 38.27 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఇది ప్రపంచ మొత్తం అప్పులో మూడో వంతు కంటే ఎక్కువ కావడం గమనార్హం. నిరంతర బడ్జెట్ లోటు, పెరుగుతున్న వడ్డీ చెల్లింపులే ఇందుకు ప్రధాన కారణమని ఐఎంఎఫ్ పేర్కొంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనా ఈ విషయంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ డ్రాగన్ దేశం 18.68 ట్రిలియన్ డాలర్ల అప్పుల ఊబిలో ఉంది. చైనా అప్పులు 2025లో 13.6% వృద్ధితో అత్యంత వేగంగా పెరుగుతున్నట్లు ఐఎంఎఫ్ నివేదిక పేర్కొంది. రుణాల ఊబి జాబితాలో జపాన్ కూడా ఉంది. ఈ దేశం 9.83 ట్రిలియన్ డాలర్ల అప్పుతో 3వ స్థానంలో నిలిచింది. జపాన్ అప్పు దాని జిడిపిలో దాదాపు 230 శాతంగా ఉండటం ఆ దేశ ఆర్థిక పరిస్థితికి అద్దం పడుతోంది. ఇక యూరప్ దేశాల్లోని యునైటెడ్ కింగ్‌డమ్ 4.09 ట్రిలియన్ డాలర్లతో 4వ స్థానం, ఫ్రాన్స్ 3.92 ట్రిలియన్ డాలర్లతో 5వ స్థానం, ఇటలీ 3.48 ట్రిలియన్ డాలర్లతో 6వ స్థానంలో నిలిచాయి. ఆయా దేశాల్లో సామాజిక సంక్షేమం, పింఛన్ల కోసం కోసం ఇబ్బడిముబ్బడిగా ఖర్చు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఐఎంఎఫ్ నివేదికలో పేర్కొంది. అన్ని దేశాల మాదిరిగానే భారత్ కూడా అప్పులు ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటోంది. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ. దీంతో అభివృద్ధి పనుల కోసం చేసే ఈ అప్పు సాధారణమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అయితే, కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఒక సానుకూల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. దేశ అప్పుల నిష్పత్తిని జిడిపిలో 56.1 శాతం నుండి 55.6 శాతానికి తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇండియా తర్వాత స్థానాల్లో జర్మనీ 3.23 ట్రిలియన్ డాలర్లు, కెనడా 2.60 ట్రిలియన్ డాలర్లు, బ్రెజిల్ 2.06 ట్రిలియన్ డాలర్ల అప్పులతో టాప్ 10 జాబితాలో నిలిచాయి. జర్మనీ ఆర్థిక క్రమశిక్షణ మారుపేరు. అయినప్పటికీ ఇంధన ఖర్చులు తదితర కారణాలతో అప్పుల పాలైంది. కెనడా, బ్రెజిల్ బడ్జెట్ లోటు, ప్రాంతీయ రుణాల కారణంగా అప్పుల ఊబిలో చిక్కుకున్నాయి.

## భక్తుల కోరికలు నెరవేరే

# యాదగిరి లక్ష్మీనరసింహుడు



తెలంగాణలోని ప్రముఖ ఆలయాలలో ఒకటైన, ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రస్తుత యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల కేంద్రము సమీపములో ఎత్తయిన గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో ఫిబ్రవరి 18నుండి 28 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఋష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు యాదమహర్షి చిన్నతనం నుంచే హరిభక్తుడు. ఆంజనేయస్వామి సలహాపై ప్రస్తుతం యాదగిరిగా పిలవబడుతున్న ప్రదేశంలో చాలా కాలం తపస్సు చేశారు. అప్పుడు ఒక రాక్షసుడు ఆహార అన్వేషణలో అటుగావచ్చి నిశ్చల తపస్సులో వున్న ఈ ఋషిని చూసి తినబోయాడు. ఆ విషయం తపస్సులోవున్న ఋషికి తెలియలేదుగానీ, ఆయన ఎవరి గురించైతే తపస్సు చేస్తున్నాడో ఆ శ్రీహరి ఆయుధం అయిన సుదర్శన చక్రం వచ్చి ఆ రాక్షసుని సంహరించింది. అది చూసిన ఋషి ఆ సుదర్శన చక్రాన్ని పలు విధాల ప్రార్థించి, భక్తులకు ఏవిధమైన బాధలూ కలుగకుండా దుష్ట సంహారం చేస్తూ అక్కడే వుండిపొమ్మని కోరగా ఆ సుదర్శనము అనతికాలము లోనే అక్కడ వెలయ బోవుచున్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ శిఖరాన షట్కోణాకారాన వెలసి స్వామి దర్శనానికి వచ్చు భక్తులను సదా కాపాడుతూ వుంటానని వరమిచ్చి అంతర్ధానం అయినట్లు కథనం. యాద మహర్షి తన తపస్సుని కొనసాగించగా, ఆయన తపస్సుకి మెచ్చి నరసింహస్వామి ప్రత్యక్షమై, యాద మహర్షి కోరిక మీద అక్కడ లక్ష్మీ నరసింహస్వామి గా వెలిశాడు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. ఆ ఋషి తపస్సు చేసింది, స్వామి ప్రత్యక్షమైంది కొండక్రిందవున్న పాత లక్ష్మీ నరసింహస్వామి గుడి దగ్గర అని అంటారు. యాద మహర్షి కోరిక మీదే ఆంజనేయస్వామి యాదగిరిలో క్షేత్రపాలకుడుగా వున్నాడు. ప్రహ్లాదుని రక్షించటానికి, అహోబిలంలో నరసింహస్వామి స్తంభాన్ని చీల్చుకుని వచ్చి హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత ఆ భీకర రూపాన్ని శాంత పరచటం ఎవరికీ సాధ్యం కాలేదట. అప్పుడు దేవతలంతా లక్ష్మీదేవిని ప్రార్థిస్తే ఆమె ప్రత్యక్షమై స్వామిని శాంతింప చేసిందటప్పుడు ప్రహ్లాదుడు స్వామిని అక్కడే ప్రసన్న రూపంలో కొలువై వుండమని కోరాడట. అయితే స్వామి అతి భీకర రూపంలో దర్శనమిచ్చిన ఆ ప్రదేశంలో శాంత రూపంతో కొలువై వుండటం లోక విరుద్ధమని అక్కడికి సమీపంలో వున్న యాదగిరిలో లక్ష్మీ నరసింహస్వామిగా లోక కళ్యాణార్థం కొలువు తీరుతానని బయల్దేరారు, లక్ష్మీ సమేతుడై కొండపై గల గుహలో వెలిశారు. ఆయనవెంట ప్రహ్లాదుడూ, సకల దేవతలూ వచ్చి ఆయనతోపాటు ఇక్కడ కొలువుతీరి స్వామిని సేవిస్తూ వచ్చారట. రాక్షస సంహారంచేసి లోక కళ్యాణం చేశారని సంతోషంతో స్వామివారి కాళ్ళని బ్రహ్మదేవుడు ఆకాశ గంగతో కడిగాడట. ఆ ఆకాశ గంగ లోయలలోంచి పారి విష్ణు పుష్కరిణిలోకి చేరింది. ఈ పుష్కరిణికి కూడా చాలా ప్రాముఖ్యం వుంది. ఇందులో స్నానంచేసి స్వామిని సేవించినవారికి సకల కోరికలూ తీరుతాయి. ఇక్కడ పితృకార్యాలు చేస్తే పితృదేవతలు తరిస్తారు. చాలామంది భక్తులు ఆరోగ్యం, గ్రహపీడా నివారణ, వగైరా కోరికలతో కొన్నాళ్ళపాటు ఇక్కడ వుండి విష్ణు పుష్కరిణిలో స్నానం చేసి స్వామిని సేవిస్తారు. అంతేగాక ఇప్పటికీ రోజూ రాత్రుళ్ళు ఆ చుట్టుప్రక్కల కొండలమీద తపస్సు చేసుకుంటున్న ఋషులు విష్ణు పుష్కరిణిలో స్నానంచేసి స్వామిని అర్చిస్తారట. దానికి నిదర్శనంగా వారు వచ్చేటప్పుడు మృదంగ ధ్వనులు వస్తాయట. పాదాల గుర్తులు కొందరు చూశారుట. వారు స్వామిని అర్చించిన గంధ పుష్పాదులు కూడా నిదర్శనమంటారు. మెట్ల మార్గాన వెళ్తే దోవలో శివాలయం కనబడుతుంది. ఇక్కడ శివుడు లక్ష్మీ నరసింహస్వామి కన్నా ముందు స్వయంభూగా వెలిశాడు. ఇంకో విశేషం.. ఈ మెట్లు ఎక్కి స్వామిని సేవించినవారి కీళ్ళ నొప్పులు తగ్గుతాయని భక్తుల విశ్వాసం యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ముఖద్వారం యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం నల్గొండ జిల్లాలొ ప్రముఖ మైన దివ్య క్షేత్రం: యాదగిరి గుట్టకు సంబందించిన కథకు మూలం వాల్మీకి రామాయణంలో వున్నది. విభాండక ఋషి కుమారుడు రుష్యశృంగుడు. అతని కుమారుడు హాద ఋషి, అతనినే హాదర్షి అని కూడ అంటారు. అతను నరసింహ స్వామి భక్తుడు. అతనికి స్వామివారిని ప్రత్యక్షంగా చూడాలని కోరిక పుట్టింది. ఆంజనేయస్వామి సలహా మేరకు తపస్సు చేయగా స్వామి ప్రత్యక్షమవుతాడు. ఆ ఉగ్ర నరసింహ మూర్తిని చూడలేక శాంత స్వరూపంతో కనిపించమని యాదర్షి కోరగా స్వామి వారు కరుణించి లక్ష్మీ సమేతుడై దర్శన మిచ్చి "ఏంకావాలో కోరుకో" మంటే యాదర్షి స్వామి వారికి "శాంత మూర్తి రూపంలోనె కొలువై కొండపై ఉండి పొమ్మని కోరాడు. ఆవిధంగా లక్ష్మీ నరసింహ స్వామి కొండపై అలా కొలువై ఉండిపోయాడు. కొన్నాళ్ళకు స్వామివారిని వేర్వేరు రూపాల్లో చూడాలనిపించి యాదర్షి మరలా తపస్సు చేశాడు. అతని కోరిక మేరకు స్వామి వారు జ్వాలా, యోగా, నంద, గండబేరుండ, నారసింహ రూపాల్లో దర్శనమిచ్చాడు. అందుకే ఈ క్షేత్రాన్ని పంచ నారసింహ క్షేత్రం అంటారు. ఆ ఋషి కోరిక మీదే ఆ కొండ యాదగిరిగా ఋషి పేరుమీద ప్రసిద్ధికెక్కింది. బ్రహ్మోత్సవాలు తొలిరోజు విశ్వక్సేన ఆరాధనతో ఆరంభమై అలంకార అవతార సేవలతో కొనసాగి 28న చక్రస్నానం, మహాపూర్ణాహుతితో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా 18న ఉదయం 10 గంటలకు విశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనం, సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోహణ పర్వాలు నిర్వహిస్తారు. 19 ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరీ పూజ, హవనం, దేవతాహ్వానం నిర్వహిస్తారు. 20న ఉదయం తొమ్మిది గంటలకు మత్స్య అవతార అలంకార సేవ, వేద పారాయణం, రాత్రి 7 గంటలకు శేష వాహన సేవ, 21న ఉదయం 9 గంటలకు వటపత్ర శాయి అలంకార సేవ , రాత్రి 7 గంటలకు హంస వాహన సేవ, 22న ఉదయం 9 గంటలకు శ్రీకృష్ణలంకార సేవ, రాత్రి 7 గంటలకు పొన్నవాహన సేవ, 23న ఉదయం 9 గంటలకు గోవర్ధన గిరి దారి అలంకార సేవ, రాత్రి 7 గంటలకు సింహ వాహన సేవ, 24న ఉదయం 9 గంటలకు జగన్మోహిని అలంకార సేవ, రాత్రి 7 గంటలకు అశ్వవాహన సేవ, తదుపరి శ్రీ స్వామి వారి ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. 25న ఉదయం 9 గంటలకు శ్రీరామ అలంకార హనుమంత వాహనం సేవ , రాత్రి 8 గంటలకు గజవాహన సేవ, శ్రీ స్వామి అమ్మవార్ల తిరు కళ్యాణోత్సవం నిర్వహిస్తారు. 26వ తేదీన ఉదయం 9 గంటలకు మహా విష్ణు అలంకారం, గరుడోత్సవము, రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవం, 27వ తేదీన ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహుతి, చక్రతీర్థం, సాయంత్రం 7 గంటలకు శ్రీ పుష్పయాగం, దేవతో ద్వాసన, 28వ తేదీన ఉదయం 10 గంటలకు శ్రీ స్వామివారికి అష్టోత్తర శతకటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీ స్వామివారి శృంగార డోలోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి. దేవస్థానం ఈఓ భవానీ శంకర్ ఐఎఎస్ నేతృత్వంలో అధికారులు, అర్చకులు, సిబ్బంది వివిధ శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు.

# స్వరాజ్య సంస్థాపకుడు శివాజీ



ధర్మప్రతిష్టాపనే లక్ష్యంగా, కర్తవ్య పరాయణత్వమే ధ్యేయంగా జీవించి ధన్యుడైన వారిలో నిత్యస్మరణీయుడు ఛత్రపతి శివాజీ. అందుకే శివాజీ 'స్వరూపాన్నే ధ్యానించండి, ఆయన ప్రతాపాన్నే అనుష్ఠించండి' అని సమర్థ రామదాసు వంటి మహనీ యులు మన జాతికి ప్రబోధించారు. హిందూ ధ్వజాన్ని మళ్ళీ ఉత్తుంగ శిఖరాలపై ఎగురవేసి, హిందూత్వంలో అమృతాన్ని నింపి ప్రాణప్రతిష్ఠ చేసిన మహనీయుడు శివాజీ. స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్య యుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన మహోన్నత వీరుడు శివాజీ. మహారాష్ట్ర ప్రాంతంలో యాదవులు స్థాపించిన హిందూ సామ్రాజ్యం 1307 మార్చి 24తో ఢిల్లీ సుల్తాను ఖిల్జీ ద్వారా నాశనం కాగా, ఆ తర్వాత 350 ఏళ్ల వరకూ మరో హిందూ సామ్రాజ్యమే లేకుండా పోయింది. 1630, ఫిబ్రవరి 19వ తేదీన భావి హైందవ సామ్రాజ్య నిర్మాతయైన శివాజీ జన్మించాడు. దేశభక్తిని ఉగ్గుపాలతోనే రంగరించుకున్న శివాజీ తన తల్లి జిజియాబాయి పెంపకంలో అనేక విషయాలు నేర్చుకున్నాడు. 'రామ రామరాజ్యం వంటి హైందవ సామ్రాజ్యం నిర్మాణం చేయాలనే కోరిక' శివాజీలో బాల్యంలోనే స్థిర పడింది. తల్లి సంరక్షణ, దాదాజీ ఖాండ్‌దేవ్ శిక్షణతో శివాజీ వీరుడిగా అవతరించారు. భారత రామాయణాల విశిష్టత, హిందూ మతం గొప్పదనం తల్లిద్వారా నేర్చుకున్నాడు. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం కూడా ఆమె ద్వారా పెంపొందించుకున్నాడు. తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో యుద్ధ తంత్రంలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యా పారంగతుడైన శివాజీ, మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా వ్యూహారచన చేశాడు. శివాజీ జాగీరులో రాంఝూ గ్రామ పటేలు ఒక స్త్రీని బలత్కారం చేయగా, శివాజీ 1645 జనవరి 28న పటేలును బంధించి, కాళ్ళు చేతులు నరికించి శిక్షించాడు. అలా క్రమంగా ప్రజల అభిమాన పాత్రుడైనాడు. అప్పట్లో కాశ్మీరం నుండి కావేరీ వరకు మధ్యనున్న చాందా, గోండువనం వదిలి మిగిలిన దేశమంతా తురుష్కుల అధీనంలో ఉండేది. దేవగిరి, విజయనగరం రాజ్యాలు అస్తమించాక, శివాజీ తన మిత్రులందరితో భవిష్యత్ సామ్రాజ్య నిర్మాణం కోసం దేవాలయం, కొండగుహ, కీకారణ్యం ఇసుకతిన్నెలు వంటి అనేక ప్రాంతాల్లో చర్చోపచర్చలు జరిపేవాడు. మొదట బీజాపూర్ సుల్తాన్ చే నిర్లక్ష్యం కాబడిన 'కాన' లోయలోని 'తోరణ' దుర్గాన్ని జయించి, హిందూ సామ్రాజ్య నిర్మాణానికి తోరణం కట్టాడు. తోరణ దుర్గానికి ఎదురుగా ఉన్న 'మురుంబదేవ' గిరిపై కొత్త కోటను నిర్మించి, "రాజ్ గఢ్" అని పేరు పెట్టాడు. తర్వాత 'కువారి' కోటను వశం చేసుకున్నాడు. ఇవన్నీ పదహారేళ్ళ ముక్కుపచ్చలారని ప్రాయంలో శివాజీ చేసిన గొప్ప పనులు. తర్వాత కొండణా కోటను తన స్వరాజ్యంలో కలుపు కున్నాడు. శివరళ, సుభాను మంగళి దుర్గాలను వశపరు కున్నాడు. 1648 జూలై 25న వజీరు ముస్తాపా, బాజీ ఘోర్పడేలు సైన్యంతో శివాజీ తండ్రి అయిన శహాజీని బంధించారు. శత్రువును శరణు వేడడమా? తండ్రి ప్రాణమా? స్వరాజ్యమా? అనే శివాజీ ప్రశ్నలకు... తల్లి జిజియా బాయి- తన మాంగల్యం కన్నా దేశభక్తి గొప్పదని చెప్పింది. పురంధర కోటలో ఉన్న శివాజీ సైన్యానికి, ఫతేఖాన్ సైన్యానికి భీకర యుద్ధం జరగగా శివాజీకే విజయం దక్కింది. 1648 ఆగస్టు 8న ఫతేఖాన్ ఓటమి పాలయ్యాడు. పురంధర దుర్గంలో ఫతేఖాన్, బెంగుళూరులో ఫరాదఖాన్ ఓటముల పాలు కాగా, బీజాపూర్ లో శివాజీ తండ్రి శహాజీ 1649 మే 16న బంధ విముక్తు డైనాడు. 1654 మే 23న బీజాపూర్ సుల్తాన్ మహరాజ్ పంత్ మరణించగా, ఆయన నలుగురు కుమారుల తగవుల కారణంగా శివాజీ వారిని బంధించి, ఉచిత పదవులు కట్టబెట్టి నేతాజీ పాల్కర్ అనే సర్దార్ ను అధికారిగా నియమించాడు. కృష్ణానదీ సమీపంలో టావళి అధిపతి దౌలత్ రావు మృతి చెందగా, ఆయనకు సంతానం లేకపోగా దత్తపుత్రుడైన యశ్వంతరావుకు పదవినిచ్చాడు. తన అధికారానికి ఇష్టపడని కారణాన 1656లో యుద్ధంలో యశ్వంతరావును ఓడించి శివాజీ స్వరాజ్యంలో కలుపుకున్నాడు. దీనిలో అంతర్భాగ కొండ ప్రాంతమైన 'రాయరి' కోటనే కొన్నే ళ్ళకు శివాజీ రాజధానిగా రాయగఢ్ దుర్గం ఏర్పడింది. 1956 నవంబర్ 2న బీజాపూర్ సుల్తాన్ ఆదిల్షా చనిపోగా, మొగలు సామ్రాజ్య దక్షిణ సుబేదారైన ఔరంగజేబు అనుమతిని పొంది, 1957 ఏప్రిల్ 23న స్వరాజ్యంలో కలుపుకున్నాడు. శివాజీ బీజాపూర్ ప్రాంతం నుండి కోంద్వానా కొంకణ, దండరాజపురి, భీవండి కళ్యాణి, మాహు తదితర కోటలను పోర్చుగీసు వారి నుండి చోళ ప్రాంతాన్ని జయించాడు. కటావ్, మయణి, అష్టి, ఖరాహడ్, సుపే, కొల్హాపూర్, పనాళీ గడ్, యెగావ్ తదితర కోటలను జయించాడు. ఔరంగజేబు సలహాదారులైన కారతలబ్ ఖాన్, నామదర్ ఖాన్, ఇనాయత్ ఖాన్, షహిస్త ఖాన్, భావసింహ, జస్వంత సింహ తదితరులను ఓడించాడు. అహ్మద్ నగర్ , సూరత్, జున్నర్ నగ రాలను లూటీ చేశాడు. అలా సాగిన శివాజీ తన జైత్రయాత్ర ఫలితంగా 1674 జూన్ 6న సింహాసనాన్ని అధిష్టించాడు. ఆంగ్లేయుల రాయబారి హెన్రీ ఆక్సెం డర్ శివాజీ మహారాజుకు ప్రణమిల్లి భారీగా కానుకలు సమర్పించాడు. తన రాజ్యానికి అష్టప్రధానుల పారశీక నామాలను మార్చి సంస్కృత పేర్లను శివాజీ పెట్టాడు. ప్రభుత్వ పాలన సంస్కృతంలోనే సాగాలని రాజ్య వ్యవహార కోశం తయారు చేయించాడు. యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా శివాజీ భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమైన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేశాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు కాకుండా ప్రజాక్షేమం కోసమే పాటుపడ్డాడు. సుదీర్ఘంగా యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్ర స్థలాలను ధ్వంసం చేయలేదు. ఓడిపోయిన శత్రురాజ్యంలో నిస్సహాయులు, మహిళలు, పసివారికి సహాయం చేశాడు. తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా గౌరవించాడు. కేవలం ఆలయాలే కాదు, మసీదులను సైతం కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడు వంతులు ముస్లిములే. వారిని కూడా ఉన్నత పదవుల్లో నియమించాడు. ముప్పై సంవత్సరాలు శివాజీ, ఆయన అనుచరులు చూపిన పరాక్రమాలు, కర్తృత్వ శక్తి, త్యాగశీలత, ధ్యేయ నిష్ఠ హిందువులలో నూతనోత్తేజం నింపాయి. యాభై ఏళ్ళ సామ్రాజ్య నిర్మాణ కృషి ఫలితంగా దేహం పూర్తిగా అలసిపోగా ఆరోగ్యం క్షీణించడంతో, 1680 ఏప్రిల్ 3న శివాజీ తుది శ్వాస విడిచాడు. భారతీయుల ఆదర్శ పురుషునిగా నిలిచాడు.



# అరటిపండు ఎప్పుడు తింటే ప్రాణాంతం!

ప్రకృతి ప్రసాదించిన అత్యంత పోషకమైన ఫలాలలో అరటిపండు ఒకటి. పొటాషియం, మెగ్నీషియం, పీచు పదార్థాలు సమృద్ధిగా ఉండే ఈ పండు తక్షణ శక్తిని అందిస్తుంది. వ్యాయామం తర్వాత లేదా ఉదయం అల్పాహారంగా అరటిపండు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదే. అయితే, ఏ ఆహారమైనా పరిమితి దాటితే సమస్యలు తలెత్తుతాయి. అరటిపండ్ల విషయంలో కూడా అదే వర్తిస్తుంది. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థపై ఇవి చూపే ప్రభావాన్ని నిర్లక్ష్యం చేయకూడదు.అరటిపండును తక్షణ శక్తినిచ్చే ఫలంగా మనం గుర్తిస్తాం. అయితే, ఆరోగ్యానికి మేలు చేస్తుందని భావించి వీటిని అతిగా తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ మరియు తీవ్రమైన కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పచ్చి అరటిపండుతో మలబద్ధకం ముప్పు! సగం పండిన లేదా పచ్చి అరటిపండ్లలో ఉండే 'రెసిస్టెంట్ స్టార్చ్' జీర్ణం కావడం చాలా కష్టంగా ఉంటుంది. ఇవి ఎక్కువగా తీసుకుంటే జీర్ణక్రియ మందగించి మలబద్ధకానికి దారి తీసే అవకాశం ఉంది. అలాగే ఇందులోని పెక్టిన్ అనే పీచు పదార్థం పేగులలోని నీటిని పీల్చుకోవడం వల్ల మలం గట్టిపడే పరిస్థితి ఏర్పడవచ్చు. గ్యాస్ కడుపు ఉబ్బరం వేధిస్తోందా? మరోవైపు, పూర్తిగా పండిన అరటిపండ్లను అధికంగా తీసుకుంటే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఇందులోని కరిగే ఫైబర్, ఫ్రక్టోజ్ పేగులలోని బ్యాక్టీరియాతో కలిసి విచ్ఛిన్నం కావడంతో గ్యాస్ ఉత్పత్తి పెరుగుతుంది. అదేవిధంగా సార్బిటాల్ అనే సహజ చక్కెర ఆల్కహాల్ అధికంగా తీసుకున్నప్పుడు అజీర్తి సమస్యలు పెరగవచ్చు. ఖాళీ కడుపుతో తింటే అపాయమేనా? ఒక్కసారిగా ఎక్కువ అరటిపండ్లు తింటే పొట్టలో నొప్పి లేదా తిమ్మిర్లు అనిపించే అవకాశం ఉంది. శరీరం ఒక్కసారిగా అధిక ఫైబర్‌ను తట్టుకోలేక ఇబ్బంది పడుతుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో ఎక్కువగా తింటే ఈ సమస్యలు ఎక్కువగా కనిపించవచ్చు. కొంతమందిలో మెగ్నీషియం, పొటాషియం అధికంగా చేరడం వల్ల వికారం లేదా వాంతుల భావన కూడా కలగవచ్చు. అతిసారం పోషకాల అసమతుల్యత ఇంకా కొందరిలో విరేచనాలు కూడా సంభవించవచ్చు. అరటిపండ్లలోని పీచు పదార్థం పేగుల కదలికను వేగవంతం చేయడం వల్ల మోతాదు మించితే అతిసారానికి దారి తీస్తుంది. అదనంగా, రోజూ ఎక్కువగా అరటిపండ్లనే తీసుకోవడం వల్ల ఇతర పోషకాలు కలిగిన ఆహారాలను తీసుకోకుండా పోషకాల అసమతుల్యత ఏర్పడే ప్రమాదం ఉంది. నిపుణుల సూచన: అరటిపండ్లు ఆరోగ్యానికి మంచివే, కానీ పరిమితి పాటించడం అత్యంత ముఖ్యం. సాధారణంగా ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు ఒకటి లేదా రెండు అరటిపండ్లు తీసుకోవడం సరిపోతుంది. కిడ్నీ సమస్యలు లేదా మధుమేహం ఉన్నవారు మాత్రం వైద్యుల సలహా మేరకు మాత్రమే తీసుకోవడం శ్రేయస్కరం.

# క్యాబేజీ కానీ వీరికి మాత్రం విషమే!



క్యాబేజీని పోషకాలకు పవర్‌హౌస్‌గా పిలుస్తారు. ఎందుకంటే ఇది మన శరీరానికి కావాల్సిన అన్ని పోషకాలను అందిస్తుంది. ఇందులో విటమిన్ సి, విటమిన్ కె, ఫైబర్, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, బరువు తగ్గడంలో సహాయపడుతుంది. ఇది గుండె ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ ఇది అందిరికి ఒకే రమైన ప్రయోజనాలను అందించదు. కొన్ని సమస్యలు ఉన్నవారు. వీటిని తినడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. జీర్ణ సమస్యలు ఉన్నవారు: క్యాబేజీ మనకు అనేక విధాలుగా ప్రయోజనాలను అందించినప్పటికీ జీర్ణ సమస్యలు ఉన్నవారు దీన్ని తీసుకునే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఇందులో రాఫినోస్ అనే కార్బోహైడ్రేట్ ఉంటుంది, ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం తీసుకుంది. అలాగే కొన్ని సార్లు పూర్తిగా జీర్ణం కాదు. ఇప్పటికే జీర్ణ సమస్యలు ఉన్నవారు. దీన్ని తినడం వల్ల ఉబ్బరం, గ్యాస్, తిమ్మిరికి కారణమవుతుంది. అధిక ఫైబర్ కంటెంట్ సున్నితమైన కడుపు ఉన్నవారిలో విరేచనాలకు కూడా కారణమవుతుంది. కిడ్నీ రాళ్లు ఉన్నవారు: కిడ్నీ స్టోన్స్ వ్యాధితో బాధపడేవారు ఈ క్యాబేజీని తినే ముందు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇందులో ఉండే ఆక్సాలిక్ ఆమ్లం కాల్షియంతో కలిసి రాళ్లను ఏర్పరిచే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాబట్టి ఇప్పటికే మీరు కిడ్నీ రాళ్ల సమస్యతో బాధపడుతుంటే ఇది దాన్ని మరింత ప్రభావం చేస్తుంది. కాబట్టి ఇది మూత్రపిండాల పనితీరు నెమ్మదిగా ఉన్నవారికి వీటికి దూరంగా ఉండడం బెటర్. థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు: థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు కూడా క్యాబీజీ విషయంలో జాగ్రత్త వహించారు. ముఖ్యంగా గాయిటర్ ఉన్నవారు క్యాబేజీని మితంగా లేదా వైద్యుడి సలహాతో మాత్రమే తీసుకోవాలి. క్రూసిఫెరస్ కూరగాయలలోని గాయిట్రోజెన్లు అయోడిన్ శోషణకు ఆటంకం కలిగిస్తాయి, ఇది థైరాయిడ్ హార్మోన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఈ సమస్యలు ఉన్న వారు క్యాబేజీ తినకపోవడమే మంచింది. గుండె సమస్యలకు రక్తాన్ని పలుచబరిచే మందులు తీసుకునే వ్యక్తులు కూడా క్యాబేజీ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. క్యాబేజీలో విటమిన్ కె అధికంగా ఉంటుంది, ఇది మందుల ప్రభావాన్ని తగ్గిస్తుంది, ఇది రక్తం గడ్డకట్టే ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి ఇలాంటి మందలు వాడే వ్యక్తులు కేవలం వైద్యుల సలహాతో మాత్రమే క్యాబేజీని తమ ఆహారంలో చేర్చుకోవాలి. అలెర్జీలు, ఉబ్బసం ఉన్నవారు లేదా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు దీనిని మితంగా తీసుకోవడం ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. కొంతమందికి క్యాబేజీ తిన్న తర్వాత హిస్టామిన్ ప్రతిచర్య వల్ల చర్మంపై దద్దుర్లు, దురద లేదా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలుగుతుంది. కాబట్టి క్యాబేజీ ఆరోగ్యకరమైనది అయినప్పటికీ, కొంతమందికి ఇది హానికరం కావచ్చు.. వైద్యుడి సలహా లేకుండా పైన పేర్కొన్న సమస్యలు ఉన్న వారు క్యాబేజీని తినకండి.

# వాము ఆకు రోగాలను తరిమికొట్టే బ్రహ్మాస్త్రం



వాము ఆకు అపారమైన ఔషధ గుణాలున్న సుగంధ మొక్క.. వాము ఆకులు జీర్ణశక్తిని మెరుగుపరచి, ఎసిడిటీని నివారిస్తాయి.. విటమిన్ ఎ, సి, సెలీనియం, జింక్ వంటి పోషకాలతో సమృద్ధిగా ఉండే వాము ఆకులు.. జీర్ణ సమస్యలు, నెలసరి నొప్పి, బరువు తగ్గడం, దగ్గు వంటి అనేక అనారోగ్యాలకు ఉపశమనం అందిస్తాయి. ప్రకృతి ఎన్నో సహజసిద్ధమైన, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఔషధ మొక్కలను ప్రసాదించింది. వీటితో పలు అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చు.. అలాంటి ఔషధ మొక్కలలో వాము మొక్క ఒకటి.. వాము ఆకులలో ఎన్నో పోషకాలతో పాటు.. ఔషధ గుణాలు దాగున్నాయి. వాము ఆకులోని యాంటీ ఆక్సిడెంట్స్, పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేయడంతోపాటు.. సీజనల్‌గా వచ్చే జలుబు, దగ్గు సమస్యలను నియంత్రిస్తాయి.. అందుకే దీనిని పవర్‌ఫుల్ హెర్బల్ ప్లాంట్ అంటారు. అయితే.. వాము ఆకులను పలు ప్రాంతాలలో పలు విధాలుగా పిలుస్తారు. స్థానికంగా "దగ్గాకు" లేదా "బజ్జీ ఆకు" అని కూడా పిలుస్తారు.. సంస్కృతంలో దీనిని కర్పూరవల్లి అని వ్యవహరిస్తారు. ఈ మొక్క అనేక ఔషధ, సుగంధ విలువలను కలిగి ఉంది. ఇది జీర్ణశక్తిని పెంపొందిస్తుంది. ఎసిడిటీ సమస్యలను నివారిస్తుంది.. గట్ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వాము ఆకులో విటమిన్ ఎ, సి, సెలీనియం, జింక్ వంటి కీలకమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలు శరీర జీవక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. వాము ఆకులను సంప్రదాయకంగా కడుపు నొప్పి, అజీర్ణం, నెలసరి సమస్యలు, అతిసారం, బరువు తగ్గడం, పంటి నొప్పి, చనుబాలు పట్టడం, జలుబు వంటి అనేక రకాల ఆరోగ్య సమస్యలకు ఇంటి చిట్కాగా ఉపయోగిస్తారు. ఈ ఆకులు పొత్తికడుపు కండరాలను సడలించి, అపానవాయువు, మలబద్ధకం వంటి లక్షణాలను నివారిస్తాయి. వాము ఆకు కేవలం ఔషధ గుణాలను మాత్రమే కాకుండా, ఆహార పదార్థాలకు రుచిని అందించే సుగంధ మూలికగా కూడా ఉపయోగపడుతుంది. దీనిని బజ్జీలుగా, స్నాక్స్‌గా తీసుకోవచ్చు. సలాడ్లు, సూప్‌లలో చేర్చడం లేదా నేరుగా ఆకులను తినడం ద్వారా కూడా దీని ప్రయోజనాలను పొందవచ్చు. వాము ఆకు డికాక్షన్ లేదా హెర్బల్ టీ రూపంలో కూడా తీసుకోవచ్చు.. ఉదయాన్నే తాగితే మరిన్ని ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు.. వాము ఆకు మొక్కలు సాధారణంగా రెండు రకాలుగా లభిస్తాయి: ఒకటి పెద్ద, ఆకుపచ్చని, మందపాటి ఆకులతో కూడిన రకం, మరొకటి అలంకరణ కోసం పెంచే వెరిగేటెడ్ రకం. ఈ రెండు రకాలూ ఔషధ ప్రయోజనాలకు ఉపయోగపడతాయి. వాము ఆకు వంటి సుగంధ మూలికలు దోమలను నిరోధించే (మస్కిటో రెపల్లెంట్) గుణాలను కూడా కలిగి ఉంటాయి. వీటి సువాసన దోమలను దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇటువంటి ఔషధ మొక్కలను పెంచి, వాటి ప్రయోజనాలను అవగాహన చేసుకోవడం ద్వారా మన ఆరోగ్యాన్ని సహజ సిద్ధంగా కాపాడుకోవచ్చు. ఈ వాము మొక్కలను కిచెన్ గార్డెన్లలో సులభంగా పెంచుకోవచ్చు. ఒక్కసారి మొక్క నాటితే చాలు.. అవి ఏపుగా పెరుగుతుంది..

# ఆవాలు వల్ల కలిగే లాభాలెన్నో..

ఆవాలు కేవలం రుచిని పెంచడం మాత్రమే కాదు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. కూరలకు ప్రత్యేకమైన వాసన, రుచి జోడించడమే కాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో కూడా సహాయపడతాయి. ఆవాలలో మెగ్నీషియం, సెలీనియం, ఒమేగా?3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. భారతీయ వంటకాలు ఆవాలు లేకుండా పూర్తి కాదనేది అతిశయోక్తి ఏమి కాదు. ఎందుకంటే.. వంటగదిలో ఆవాలు ఒక అనివార్యమైన పదార్థం. దాదాపు ప్రతి వంటకంలోనూ ఇవి ఉపయోగిస్తారు. ఆవాలు కేవలం రుచిని పెంచడం మాత్రమే కాదు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తాయి. కూరలకు ప్రత్యేకమైన వాసన, రుచి జోడించడమే కాకుండా, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని నిర్విషీకరణ చేయడంలో కూడా సహాయపడతాయి. ఆవాలలో మెగ్నీషియం, సెలీనియం, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు వంటి ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా సెలీనియం ఆస్తమా తీవ్రతను తగ్గించడంలో సహాయపడుతుంది. వీటిలో ఉన్న శోథ నిరోధక గుణాలు ఆర్థరైటిస్, మైగ్రేన్ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించవచ్చు. ఆవాలు వేయించిన వంటకాలు ఆకలిని పెంచడంలో, జీర్ణ ఎంజైమ్‌ల క్రియాశీలతను వేగవంతం చేయడంలో ఉపయోగపడతాయి. ఆవాలకు సహజ రక్షణ గుణాలు కూడా ఉన్నాయి. ఊరగాయల్లో ఆవాలు వేయడం వల్ల బూజు ఏర్పడకుండా నిరోధించవచ్చు. మాంసం వండేటప్పుడు కొద్దిగా ఆవాలు జోడిస్తే అది త్వరగా బ్రౌన్ అవుతుంది. చేపల కూర వండే ముందు ఉప్పుతో పాటు ఆవాల పొడి కలిపితే చేపలలో ఉండే అసహజ వాసన తగ్గుతుంది.ఆవాల యొక్క పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, కూరలో వేసే ముందు స్వల్పంగా వేయించడం మంచిది. ఆకుకూరలు తయారు చేసే సమయంలో ఆవాలను రుబ్బి వేయడం కంటే స్వల్పంగా దంచి వేయడం వల్ల రుచి, పోషక గుణాలు మరింత మెరుగుపడతాయి. నల్ల ఆవాలు, తెల్ల ఆవాలు వంటి రకాలున్నప్పటికీ, భారతీయ నల్ల ఆవాలు రుచి, గుణాల పరంగా విశిష్టమైనవిగా భావించబడుతున్నాయి. ఆవాలను ప్రతిరోజు వంటల్లో సరిగ్గా ఉపయోగిస్తే, రుచితో పాటు ఆరోగ్యాన్ని కూడా సులభంగా పొందవచ్చు.



## తెలంగాణ ఆర్ టి ఐ కమిషనర్‌తో పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ మహేందర్ గౌడ్



**అగ్నిధార న్యూస్ గోదావరిఖని టౌన్ ఫిబ్రవరి 18** నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు, ఇది మన హక్కు సమాచార పత్రిక మేనేజింగ్ డైరెక్టర్ వడ్లకొండ మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషన్ కమిషనర్లతో కీలక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్లు పి. వి. శ్రీనివాస్ రావు, భోపాల్ , ప్రవీణ్, అయోధ్య రెడ్డి, సింగరేణి మైనింగ్ ప్రాంతాన్ని సందర్శించేందుకు వచ్చిన సమయంలో, సుందిళ్ల లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం సమీపంలో వారిని మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో కమిషనర్లకు "మన హక్కు" డైరీలు అందజేసి, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని పరిశ్రమలు, విద్యాసంస్థలు, కార్పొరేషన్ సమస్యలపై ఆర్టీఐ దరఖాస్తుల పరిస్థితిపై విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ అధికారులు ఆర్టీఐకి సరైన సమాధానాలు ఇవ్వకపోతే వారిపై కఠిన చర్యలు తప్పవని కమీషనర్ స్పష్టం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి కండె సాగర్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు దుర్గాప్రసాద్, విజయ గాంధీ తదితరులు పాల్గొన్నారు..

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్:** ఈరోజు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకోవడం జరిగింది. విద్యార్థులే ఉపాధ్యాయులైన సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఉపాధ్యాయులైన విద్యార్థులు ఒక్కొక్కరు మాట్లాడుతూ ఈరోజు టీచర్ కావడం చాలా సంతోషం అనిపించింది అని చెప్పారు. జిల్లా విద్యాధికారిగా వంశిక,మండల విద్యాధికారిగా కార్తీక్, పాఠశాల హెడ్మాస్టర్ గా మేఘన మిగత వారు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అంగడి అరుణ దేవి, ఉపాధ్యాయులు పగిడ్యాల్ బోరు కృష్ణయ్య, బి.మల్లేష్, కె.వెంకటయ్య మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లోపై బీజేపీ ఆత్మవిమర్శ



**హైదరాబాద్ :** తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఫిబ్రవరి 11న ఎన్నికలు జరిగాయి. 13న కౌంటింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. 2,569 వార్డుల్లో 1,530 స్థానాలు గెలిచి పట్టణ రాజకీయాల్లో బలం చాటుకుంది. కార్పొరేషన్లలో 140 సీట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక బీఆర్ఎస్ 781 వార్డులు, కార్పొరేషన్లలో 53 మాత్రమే గెలిచి ద్వితీయ స్థానంలో ఉంది. జాతీయ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 245 వార్డులు, కార్పొరేషన్లలో 66 డివిజన్లు గెలిచింది. అయితే గతంతో పోలిస్తే బీజేపీ సీట్లు గణనీయంగా తగ్గాయి. ఎంపీలు, ఎమ్మెల్యే సీట్లు పెరిగినా.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గడం ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉంది.ఇక మున్సిపల్ ఎన్నికల్లో 26 మున్సిపాలిటీల్లో ఎలాంటి పార్టీకీ మెజారిటీ లేకపోవడంతో స్వతంత్రులు, వామపక్షులు కీలకం. కాంగ్రెస్ ఎక్కువ స్థానాలు సాధించేందుకు కొఆప్షన్ వ్యూహాలు రూపొందిస్తోంది. కాంగ్రెస్ పంచాయతీ విజయాల తర్వాత పట్టణాల్లో కూడా బలపడింది. బీఆర్ఎస్ పట్టణ ప్రజల అసంతృప్తికి గురై చతికిలబడింది. బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీల ప్రాంతాల్లో (ఆదిలాబాద్, కామారెడ్డి) మెరుగైన ఫలితాలు వచ్చినా, మొత్తంగా తగ్గుదల. భైంసాలో రెబెల్స్ విజయం పార్టీ అంతర్గత సమస్యలను తెలియజేస్తోంది.పట్టణ ఓటర్లు స్థానిక సమస్యలు పరిష్కరించే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇచ్చారు. కేంద్రం పంచాయతీలకు, మున్సిపాలిటీలకు నేరుగా నిధులు ఇస్తున్నా.. బీజేపీని ఆదరించలేదు. బీజేపీని జాతీయ పార్టీగా, దేశ రక్షణ పార్టీగానే తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. స్థానిక సమస్యలు పరిష్కరించే పార్టీగా భావించడం లేదు. ఈ విషయపై బీజేపీ దృష్టి పెట్టాలి. బీజేపీ బలం తగ్గడం తెలంగాణతోపాటు, దేశ విషయాలపై ప్రజల అభిప్రాయాన్ని సూచిస్తుంది.

## క్యాతనపల్లిలో ఉద్రిక్తత.. బాల్క సుమన్ అరెస్ట్

**మంచిర్యాల :** మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఉద్రిక్తత నెలకొంది. ఇక్కడ ఛైర్మన్ ఎన్నిక విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది. బిఆర్ఎస్ నేత బాల్క సుమన్ ఇంటి చుట్టు పోలీసులు మోహరించారు. అనంతరం ఆయన్ను అరెస్ట్ చేశారు. దీంతో భారీగా అక్కడికి చేరుకున్న కార్యకర్తలు అరెస్టును అడ్డుకొనే ప్రయత్నం చేశారు. మరోవైపు క్యాతనపల్లిలో ఉద్రిక్తతల నడుమ బంద్ కొనసాగుతోంది. క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నికను మంగళవారం ఎంపి వివేక్ వెంకటస్వామి అడ్డుకున్నారని.. తమపై కాంగ్రెస్ కౌన్సిలర్లు దౌర్జన్యం చేసి అసభ్యకరంగా ప్రవర్తించారని.. బిఆర్ఎస్, సిపిఐ మహిళ కౌన్సిలర్లు కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో బుధవారం పట్టణ బంద్‌కు బిఆర్ఎస్, సిపిఐ పిలుపునిచ్చింది.

## హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం

**హైదరాబాద్ :** సచివాలయంలోని ఛాంబర్ లో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక , రెండు పడకల గదుల ఇండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షించారు. ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పారదర్శకతగా వ్యవహరిస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి అందించటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం . ఎల్ వన్ (ఒ1) కింద 4800 మంది అర్హులైన ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇల్లు నిర్మించుటకై నిధులు మంజూరు చేస్తాం . అలాగే ఎల్ టు (ఒ2) కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకు పైగా దరఖాస్తులు వివిధ నియోజకవర్గాల నుండి పేద ప్రజలు అందజేశారు ,హైదరాబాద్ మహానగరంలో స్థలాలు సేకరించి జీ + 5-10 వరకు ఇందిరమ్మ ఇల్లు చేపట్టే ఆలోచనలో ప్రభుత్వం ఉంది . పెండింగ్ లో ఉన్న 2 బెడ్ రూమ్ ఇల్లు పనులు పూర్తి చేసి అర్హులకు అందించాలని అధికారులకు సూచించారు,. ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయి.. లబ్ధిదారులు ఎంత మంది తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది . ఇప్పటికే పలు ప్రాంతాల్లో 2ఎష్టని లబ్ధిదారులకు అందించమని ఇంకా పెండింగ్ పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల సేకరణ,అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలు పూర్తి, పూర్తయిన ఇండ్ల కేటాయింపు తదితర అంశాలపై శాసనసభ్యులతో కలిసి సమీక్షించారు. తరువాత హైదరాబాద్ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల శాసనసభ్యుల అభిప్రాయా లను ఈ సందర్భంగా స్వీకరించి చేపట్టే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పిడి హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు

**వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి.**

**వనపర్తి :** ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతి ఉత్సవాలను బుధవారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగవరం గ్రామ శివారులోని సేవా లాల్ బంజారా భవన్ లో సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని నలుమూలల ఉన్న తాండాల నుండి గిరిజనులు హాజరు కాగా లంబాడి మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరయ్యారు. ముందుగా సేవాలాల్ మహారాజ్, మేరమ యాడి దేవతకు మహాబోగ్ (హోమం) కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్, లంబాడి పూజారులు రాజ్ పవార్, బిక్ష్యా నాయక్ తో కలిసి సాంప్రదాయ బద్దంగా హోమంలో నెయ్యి, కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని సమస్త ప్రజలు ఆయురారోగ్యాలు, ధన ధాన్యాలతో వర్ధిల్లె విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ అందరికీ ఆదర్శప్రాయుడని, జీవ హింస చేయరాదని, అబద్ధం మాట్లాడవద్దు, దొంగతనాలు చేయవద్దు, మాంసాహారం చేయవద్దని బోధించారని గుర్తు చేశారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని చెప్పారు. శాసన సభ్యులు మేఘా రెడ్డి మాట్లాడుతూ సేవాలాల్ 287వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. వనపర్తి నియోజకవర్గానికి రూ.2.68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దౌర్జన్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో పోరాటం చేసిన యోధుడని అన్నారు. దొంగతనాలు చేయొద్దు, మాంసాహారం తినొద్దు అని బోధించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పి. సీతారాం నాయక్, గిరిజన అభివృద్ధి అధికారి అధికారులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మిడిదొడ్డి మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, గిరిజన సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన మహిళలు, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కౌన్సిలర్లు తమ సోదరీమణుల మీద దౌర్జన్యం

**కరీంనగర్ :** కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది కౌన్సిలర్లు తాగి వచ్చి తమ మహిళా కౌన్సిలర్ సోదరీమణులను తాకరాని చోట తాకారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీ అక్కడ కూర్చుని మా సోదరీమణుల మీద దౌర్జన్యం చేయిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో ఆడకూతుళ్లు లేరా నిలదీశారు. తాను రౌడీయిజం చేయలేదని, మంత్రి, ఎంపీలే రౌడీయిజం చేశారని ఆరోపించారు. మంత్రి, ఎంపీ తీరుకు నిరసనగా బీఆర్ఎస్, సీపీఐ కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ బంద్‌కు పిలుపునిస్తున్నామని అన్నారు.క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడిన నేపథ్యంలో బాల్క సుమన్ సీపీఐ నాయకులు, కౌన్సిలర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఒక మున్సిపల్ ఛైర్మన్ పదవి కోసం ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా, సిగ్గుండాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.మీరు విజ్ఞప్తి చేస్తే ఛైర్మన్ పదవిని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చేందుకు సిద్ధమే అన్నారు. తమ ఆడకూతుళ్ల కంటే మున్సిపల్ ఛైర్మన్ పదవి తమకు ఎక్కువ ఏమీ కాదని అన్నారు. వివేక్ కుటుంబం ఎన్ని పదవులు అనుభవించింది, ఈ ప్రాంతంలో వారికి ఎంత గౌరవం ఉంది, కానీ ఇప్పుడు ఇంత దిగజారి ప్రవర్తించడమేమిటని ధ్వజమెత్తారు. ఇంత అనైతిక చర్యలకు పాల్పడమేమిటని ప్రశ్నించారు. రేపు బంద్‌కు అందరూ మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారుపోలీసుల తీరుపై బాల్క సుమన్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తల్లా ప్రవర్తించారని ఆరోపించారు. ఇక ఖాకీ దుస్తులు అవసరం లేదు, కాంగ్రెస్ రంగు దుస్తులు వేసుకుని, రేవంత్ రెడ్డి పాటలు పెట్టుకుని డ్యాన్స్ చేసుకోండని వ్యాఖ్యలు చేశారు. తమపై ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోవాలని అన్నారు. ప్రజల పక్షాన, సింగరేణి కార్మికుల పక్షాన, రైతుల పక్షాన ప్రతిపక్ష నాయకుడిగా తాను పోరాటం చేస్తానని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో 22 వార్డులు ఉండగా, బీఆర్ఎస్ 10, కాంగ్రెస్ 7, సీపీఐ 4, స్వతంత్రులు ఒక స్థానాన్ని గెలుచుకున్నారు. అయితే రెండు ఎక్స్ అఫీషియో సభ్యులు, స్వతంత్ర అభ్యర్థి మద్దతుతో కాంగ్రెస్ బలం 10కి చేరుకుంది. దీంతో క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక ఉత్కంఠగా మారింది. అయితే ఉద్రిక్తతల నేపథ్యంలో కోరం లేదని చెబుతూ క్యాతనపల్లి మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికను అధికారులు వాయిదా వేశారు.

## భార్యను దారుణంగా చంపేశాడు

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో దారుణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ప్రతి రోజు హత్యలు, ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలు ఇలా ఒక్కటేమిటి ప్రతి రోజు ఎన్నో జరుగుతున్నాయి. ఇప్పుడు నగరంలో మరో ఘటన చోటు చేసుకుంది. వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీ అపార్ట్‌మెంట్‌లో దారుణం జరిగింది. ఓ దుండగుడు ఓ మహిళను కత్తితో దారుణంగా నరికి చంపారు. కత్తులు, పెట్రోల్ డబ్బాతో వచ్చిన దుండగులు మహిళలు హత్య చేశాడు. ఇంట్లోకి ఎవరైనా వస్తే పెట్రోల్ పోసి తగలబెడతానంటూ హెచ్చరించినట్లు పోలీసులు తెలిపారు.అయితే సదరు మహిళతో తనకు గతంలో పెళ్లి అయిందని, తను ఇప్పుడు రెండో పెళ్లి చేసుకుంది అని మహేష్ పోలీసులకు తెలిపినట్లు సమాచారం. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యుత్ ఘాతంతో మంటలు చెలరేగి పలు మేకలు మృతి



**అగ్నిధారన్యూస్ "(సంగారెడ్డి)"** షెడ్డులో అనుమానాస్పద స్థితిలో మంటలు చెలరేగి పలు మేకలు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం నగ్వార్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే నగ్వార్ గ్రామానికి చెందిన వడ్ల వీరన్న కు చెందిన 25 మేకలను రోజు మాదిరి తన షెడ్డులో కట్టేసి ఇంట్లో పడుకున్నాడు రాత్రి సమయంలో అకస్మాత్తుగా విద్యుత్ ఘాతంతో మంటలు చెలరేగి 6 మేకలు మృతి చెందగా పలు మేకలకు తీవ్ర గాయాలయ్యాయని,మంటలను గమనించి ఆర్పేందుకు ప్రయత్నించిన ఫలితం లేకుండా పోయిందని తనకు ప్రభుత్వం తరపున తగిన సహాయం అందించాలని యజమాని కోరారు.ఈ సందర్భంగా సమాచారం అందుకున్న ఆర్ఐ శ్రీకాంత్,అధికారులు,గ్రామ సర్పంచ్ గురుదాస్, ఉప సర్పంచ్ జయశ్రీ,పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.

## నిందితుడికి 5 ఏళ్ల జైలు శిక్ష -- రూ.4 వేల జరిమానా

**బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశం**

**అగ్నిధార న్యూస్ ,( రామగుండం):**

గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2015లో నమోదైన మోసం, దళితులపై దౌర్జన్యానికి సంబంధించిన కేసులో నిందితుడికి కోర్టు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించింది. అదనంగా బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. గోదావరిఖని నివాసి ముత్యాల సుదర్శన్ (తండ్రి లింగయ్య)పై భారతీయ శిక్షాస్మృతి సెక్షన్లు 493, 496తో పాటు ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నివారణ) చట్టంలోని సెక్షన్లు 3(1)(ఇ), 3(2)(ఇ) కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు క్రైం నంబర్ 285/2015గా నమోదు కాగా, అనంతరం సెషన్స్ కేసు నంబర్ 74/2017గా కరీంనగర్ జిల్లా 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయస్థానం, ప్రత్యేక ఎస్సీ/ఎస్టీ కేసుల విచారణ కోర్టులో విచారణకు వచ్చింది. విచారణ అనంతరం గౌరవ న్యాయమూర్తి ఏ.నీరజ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.4 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

**ఘటన వివరాలు ఇలా...**

ఎఫ్‌సీఐ రామగుండం ప్రాంతానికి చెందిన గంగారపు శారదాదేవి (తండ్రి నరసయ్య, కులం మాదిగ)కు 2008లో అడ్డగుంటపల్లి, గోదావరిఖనికి చెందిన ముత్యాల సుదర్శన్‌తో పరిచయం ఏర్పడింది. 2010లో ఆమెను పెళ్లి చేసుకుంటానని, ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు తీసుకున్నాడు. అనంతరం కొన్నేళ్లకు ఆమెను గర్భవతిని చేసి, "నీకు నాకు సంబంధం లేదు. నువ్వు మాదిగ కులస్తురాలివి" అంటూ ఆమెను, ఆమె కుటుంబ సభ్యులను దూషించి మోసం చేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

దీనిపై గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి దర్యాప్తు అధికారి ఎస్. మల్లారెడ్డి (ప్రస్తుతం అదనపు ఉప పోలీస్ కమిషనర్, సైబర్ క్రైమ్, హైదరాబాద్)గా వ్యవహరించారు. కోర్టులో ప్రభుత్వ తరఫున అదనపు ప్రజాప్రతినిధి న్యాయవాది కోలా ఝాన్సీ వాదనలు వినిపించారు. సమన్వయ అధికారిగా ఇంద్రసేనారెడ్డి (ఇన్‌స్పెక్టర్), సంబంధాధికారిగా తిరుపతి రావు (సహాయ ఉప ఇన్‌స్పెక్టర్), కేసు నిర్వహణ అధికారిగా మహేందర్ (పోలీస్ కానిస్టేబుల్) విధులు నిర్వర్తించారు. పోలీసులు సమగ్ర దర్యాప్తు నిర్వహించి పక్కా సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించడంతో నిందితుడికి శిక్ష ఖరారు కావడంలో అభియోగ వాదన బృందం కీలక పాత్ర పోషించింది. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సంబంధిత అధికారులను అభినందించారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాశనం గర్భిణీలకు శ్రీమంతం నిర్వహణ



**అగ్నిధార న్యూస్ ,(రామగుండం):** రామగుండం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ పీకే రామయ్య కాలనీలోని అంగన్వాడి కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాశనం కార్యక్రమాలతో పాటు గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం నిర్వహించారు. అంగన్వాడి టీచర్ సరిత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నూతనంగా ఎన్నికైన 1వ డివిజన్ కార్పొరేటర్ మడిపెల్లి విజయ మల్లేష్ హాజరై చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించి, అన్నప్రాశనం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డివిజన్ ప్రజల ఆశీర్వాదంతో తాను ఏకగ్రీవంగా కార్పొరేటర్‌గా ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడం వల్ల పేద కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కేంద్రాలను నిర్వహిస్తున్న టీచర్లు, సిబ్బంది నిబద్ధతతో సేవలందిస్తూ ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుర్రాల మల్లేష్ యాదవ్, పీకే రామయ్య కాలనీ ఆర్పీ గీద రాణి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ కు రైల్వే లైన్

**హైదరాబాద్ :** కేంద్రంలో ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న తెలుగు రాష్ట్రాల్లో రైల్వే లైన్ల విస్తరణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. నిదుల కేటాయింపులో వివక్ష చూపుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. అయితే బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే కన్నా రోడ్ల విస్తరణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా అనేక రహదార్లను జాతీయ రహదారులుగా మార్చింది. తాజాగా కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ తెలంగాణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన వికారాబాద్?కృష్ణా రైల్వే

## బిజినెస్

### ఏసీ ధరలు పెరుగుతున్నాయ్




ఎండాకాలం మొదలైంది. పెరిగే ఉష్ణోగ్రతల కారణంగా ఏసీలకు పెద్ద ఎత్తున గిరాకీ ఉండనుంది. అయితే, కొత్త ఏసీ కొనాలనుకునే వారికి కంపెనీలు షాక్ ఇవ్వనున్నాయి. ప్రస్తుత త్రైమాసికంలో ఎయిర్ కండిషనర్(ఏసీ) ధరలు పెరుగుతాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ప్రముఖ ఏసీ తయారీ కంపెనీ బ్లూస్టార్ ఇప్పటికే 10-15 శాతం మేర ధరలు పెంచేందుకు సిద్ధమవుతున్నామని స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల మధ్య ధరల పెంపును నివారించలేమని బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి త్యాగరాజన్ అన్నారు. రాగి లాంటి కీలక ముడి సరుకుల ధరలు భారీగా పెరిగాయని, దీనికి తోడు భారత కరెన్సీ రూపాయి మారకం రేటు వల్ల ఏసీ ఖర్చులను పెంచుతున్నాయి. దీనికి అదనంగా ఇంధన-సామర్థ్య లేబులింగ్ లాంటి కొత్త నిబంధనలు కూడా ఖర్చుల భారం పెంచుతోందని త్యాగరాజన్ తెలిపారు. అయితే, పరిశ్రమ కేవలం 8-10 శాతం తక్కువ లాభాల మార్జిన్‌తో కొనసాగుతోందని, కాబట్టి ముడిసరుకు వ్యయాన్ని భరించే స్థితిలో కంపెనీలు లేవు. ఫలితంగా అదనపు ఖర్చుల భారాన్ని కొంతమేర వినియోగదారులకూ బదిలీ చేయక తప్పదని స్పష్టం చేశారు. కొత్త ఎనర్జీ లేబుల్ నిబంధనల వల్లే ఏసీ స్టార్ రేటింగ్‌ని బట్టి ధరలు 5-10 శాతం పెరుగుతాయని త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. కంపెనీలు సాధారణంగా మెరుగైన డిజైన్, సామర్థ్యం ద్వారా ఖర్చులను తగ్గించడానికి ప్రయత్నించినప్పటికీ, ఈసారి పెరుగుతున్న ముడి సరుకుల ధరలు, కరెన్సీ ఒత్తిడి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించడాన్ని కష్టతరం చేశాయని పేర్కొన్నారు.

### కోడింగ్ కంటే ఏఐతో పనిచేయించడం ముఖ్యం




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ గ్రామర్‌ను తిరిగి రాస్తోంది, ఇకపై టెక్ నిపుణులకు కోడ్స్ రాయడం అంత ముఖ్యమైన పని కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని అన్నారు. మంగళవారం బెంగళూరులో జరిగిన ఇన్ఫోసిస్ ఇన్వెస్టర్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. ఇంటర్నెట్ నుంచి స్మార్ట్‌ఫోన్‌లకు గతంలో జరిగిన ఏ సాంకేతిక మార్పు కూడా ఇంత వేగంగా జరగలేదు. వాటి కంటే వేగంగా ఏఐని అలవాటు చేసుకుంటున్నారని, వ్యాపారాల నిర్వహణను పూర్తిస్థాయి మార్చేందుకు ఏఐ సిద్ధంగా ఉందని తెలిపారు. భవిష్యత్తులో కోడ్స్ రాయడం అంత ముఖ్యం కాకపోవచ్చు, ఏఐతో పని చేయించడం, టూల్స్‌ను వాడి వ్యాపారాభివృద్ధిని సాధించడమే అత్యంత ప్రధానం. రానున్న రోజుల్లో "కంపెనీలు కస్టమర్లకు అందించే సేవలు, పని చేసే విధానం, సంస్థ ఉద్దేశాల్లో మార్పులు రావాలి. ఇకమీదట ఏ మాత్రం పాత పద్ధతిలోనే సంస్థలు పనులు చేయలేవని నందన్ నీలేకని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో కోడింగ్‌కు ప్రాధాన్యత తగ్గే ఛాన్స్ ఉన్నా సరే, కొత్త ఉద్యోగాలు కూడా అంతే వేగంగా పుట్టుకొస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ప్రపంచ వ్యాప్తంగా యూట్యూబ్ డౌన్




ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ అయిన యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. చీ (ట్విట్టర్)లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. ఫిబ్రవరి 17 సాయంత్రం యూట్యూబ్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ఔటేజ్ అని చెబుతున్నారు. దీనిపై యూజర్స్ పలు సోషల్ మీడియా వేదికల్లో పోస్టులు పెడుతున్నారు. డౌన్ డిటెక్టర్ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 3 లక్షలకు పైగా యూజర్లు తమ సమస్యను రిపోర్ట్ చేశారు. ఒక్క అమెరికాలోనే 2.4 నుండి 3.2 లక్షల వరకు ఫిర్యాదులు వచ్చాయి. యూట్యూబ్ ఓపెన్ అవకుండా "హనీఎవబిష్ట్రతినిణ లివనిబి లితీనీనిణ" అనే ఎర్రర్ మెసేజ్ చూపించిందని పేర్కొన్నారు. యాప్ మరియు వెబ్‌సైట్ లోడ్ కాకపోవడం, వీడియోలు ప్లే అవకపోవడం వంటి ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇండియా, జఐ, కెనడా, బ్రెజిల్ వంటి అనేక దేశాల్లో ఈ ఇష్యూస్ కనిపించాయి. దీనిపై స్పందించిన యూట్యూబ్.. సమస్య ఏమిటో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం అని మాత్రమే తెలిపింది. కాగా రాయిటర్స్, టెక్ రీడర్స్ వంటి అంతర్జాతీయ మీడియా దీనిని సాధారణ టెక్నికల్ గ్లిచ్ గా అభివర్ణించాయి. ఇందులో ఎలాంటి హ్యాకర్స్ కుట్ర లేదని తెలిపాయి. అదే విధంగా ఫిబ్రవరి 16న ఎక్స్ కూడా కొన్ని గంటల పాటు ఔటేజ్ కి గురైంది. నమోదైంది. 2 గంటల పాటు ఫీడ్ రిఫ్రెష్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, యాప్ లోడ్ అవకపోవడం వంటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పీక్ అవర్ లో 40,000కు పైగా రిపోర్టులు నమోదయ్యాయి. కాగా దీనిపై 'చీ' కూడా అధికారికంగా స్పష్టమైన కారణం చెప్పలేదు. అయితే ఈ రెండు సందర్భాల్లోనూ హ్యాకింగ్ గాని డేటా బ్రీచ్ జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లేవు. పెద్ద ప్లాట్‌ఫామ్స్‌కి ట్రాఫిక్ పెరగడం, సర్వర్ మెయింటెనెన్స్, క్లౌడ్ సర్వీస్ సమస్యలు, నెట్‌వర్క్ లోపాలు వంటి కారణాల వల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఔటేజస్ రావడం సాధారణమని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ హ్యాకింగ్ జరిగితే డేటా లీక్, అకౌంట్ సస్పెన్షన్, సెక్యూరిటీ అలర్ట్స్ కనిపిస్తాయి. యూట్యూబ్, ఎక్స్ ఔటేజ్ లో అలాంటివేవీ కనబడక పోవడంతో ఇవి సాధారణ సాంకేతిక లోపాలే అని చెప్పవచ్చు.

### ఓలా ఎలక్ట్రిక్ షేర్లు 83 శాతం పతనం భారీగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరి




ఎంతో ఆర్భాటంగా స్టాక్ మార్కెట్లోకి ప్రవేశించిన ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు కుప్పకూలిపోతున్నాయి. ఆల్‌టైం గరిష్టాల నుంచి భారీ నష్టాలను చవి చూడటంతో ఇన్వెస్టర్లు లబోదిబోమంటున్నారు. వరుసగా నాలుగో రోజు మంగళవారం కూడా ఓలా షేర్లు పతనమయ్యాయి. ఇంట్రాడేలో 5 శాతం క్షీణించి 27.36 కనిష్ట స్థాయిని తాకగా.. తుదకు 2.91 శాతం నష్టంతో రూ.27.99 వద్ద ముగిసింది. ఓలా రేటింగ్‌ను అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థ సిటీ 'బై' నుంచి 'సెల్'కి తగ్గిస్తూ.. టార్గెట్ ధరకు 51 శాతం కోత పెట్టి రూ.27గా నిర్ణయించడమే ఇందుకు ప్రధాన కారణం. 2024లో చేరిన గరిష్ట స్థాయి రూ.157తో పోలిస్తే ఈ స్టాక్ ఏకంగా 83శాతం మేర పడిపోయి ఇన్వెస్టర్ల సంపదను ఆవిరి చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఆదాయం 55 శాతం తగ్గి రూ.470 కోట్లకు పడిపోయింది. నికర నష్టం రూ.487 కోట్లకు పెరగడం ఇన్వెస్టర్లలో మరింత ఆందోళన పెంచింది. ఒకప్పుడు అగ్రస్థానంలో ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతం మార్కెట్ వాటాతో ఐదో స్థానానికి పడిపోయింది. టీవీఎస్, బజాజ్, ఆథర్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీని ఎదుర్కొంటుంది. వినియోగదారుల నుంచి సర్వీస్, నాణ్యత పరంగా వస్తున్న ఫిర్యాదులు బ్రాండ్ విలువను దెబ్బతీశాయి. మరోవైపు కంపెనీ వద్ద నగదు నిల్వలు తగ్గడం, అప్పులు పెరగడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది.

### తొలి ఈవీ కారును విడుదల చేసిన మారుతీ సుజుకి



దేశీయ అతిపెద్ద ప్యాసింజర్ కార్ల దిగ్గజం మారుతీ సుజుకి ఎట్టకేలకు ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) విభాగంలోకి అడుగుపెట్టింది. మంగళవారం కంపెనీ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న తన మొట్టమొదటి ఈవీ ఎస్‌యూవీ ఈ-విటారా లాంచ్ చేస్తూ, ధరల వివరాలను కూడా ప్రకటించింది. రూ. 10.99 లక్షల ప్రారంభ ధరతో తీసుకొచ్చిన ఈ కారు బ్యాటరీ-యాజ్-ఏ-సర్వీస్(బాస్) మోడల్ ఆధారంగా లభిస్తుంది. అంటే బ్యాటరీ కోసం ఈఎంఐ రూపంలో కిలోమీటర్‌కు రూ. 3.99 చొప్పున విడిగా చెల్లించాల్సి ఉంటుంది. 8 ఏళ్ల బ్యాటరీ వారెంట్‌తో అందుబాటులో ఉన్న ఈ కారు 49 కిలోవాట్ అవర్, 61 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్లతో లభిస్తుంది. ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేసిన తర్వాత 440 కిలోమీటర్లు ప్రయాణించవచ్చు. 61 కిలోవాట్ అవర్ బ్యాటరీతో 543 కిలోమీటర్లు వెళ్లొచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారును కొనాలనుకునే కస్టమర్లు కంపెనీ అధికారిక వెబ్‌సైట్ లేదా డీలర్‌షిప్ సెంటర్ల వద్ద రూ.21 వేలు చెల్లించి బుకింగ్ చేయవచ్చు. డెలివరీలు త్వరలో ప్రారంభం అవుతాయని కంపెనీ స్పష్టం చేసింది. అలాగే, త్వరలో పూర్తి వేరియంట్ వారీగా ధరల వివరాలను వెల్లడించనున్నట్టు తెలిపింది. గతేడాది ఆగస్టులోనే కంపెనీ ఈ-విటారా ఉత్పత్తిని ప్రారంభించింది. ఏడాది ఆఖరు నాటికి సుమారు 13 వేల యూనిట్లను 28 దేశాలకు ఎగుమతి కూడా చేసింది.

# దూబే మెరుపులు.. అజేయంగా సూపర్ 8కు టీమిండియా.!




హ్యాట్రిక్ విజయాలతో సూపర్ 8కు దూసుకెళ్లిన భారత్ చివరి లీగ్ మ్యాచ్‌లోనూ జయభేరి మోగించింది. టాపార్డర్ రాణించకున్నా శివం దూబే(66) అర్ధ శతకంతో కదం తొక్కి భారీ స్కోర్ అందించగా.. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి(3-14) బంతితో నెదర్లాండ్స్ బ్యాటర్లను హడలెత్తించాడు. లీడే(33), అకెర్‌మన్(23)లు పోరాడినా.. 176కే కట్టడి చేసింది. 17 పరుగుల తేడాతో విజయం సాధించి.. అజేయంగా నాకౌట్ దశకు చేరుకుంది. మూడోసారి పొట్టి ప్రపంచకప్‌పై గురి పెట్టిన భారత్.. లీగ్ దశను అజేయంగా ముగించింది. గత మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసి నాకౌట్ దశకు చేరుకున్న టీమిండియా.. చివరి లీగ్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌ను ఓడించింది. శివం దూబే(66) మెరుపులతో 193 రన్స్ కొట్టిన భారత జట్టు.. అనంతరం వరుణ్ చక్రవర్తి(3-14), దూబే(2-35)లు రాణించగా కట్టడి చేసింది. భారత్ నిర్దేశించిన లక్ష్య ఛేదనలో నెదర్లాండ్స్ ఓపెనర్లు దూకుడుగా ఆడే ప్రయత్నం చేశారు. అయితే.. బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లు పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో వారి వ్యూహం ఫలించలేదు. వరుణ్ చక్రవర్తి తొలి బ్రేకిస్తూ మ్యాక్స్ డీ డౌడ్(20)ను ఔట్ చేశాడు. అనంతరం.. పాండ్యా ఓవర్లో మైఖేల్ లెవిట్(24)ను పెవిలియన్ చేర్చగా.. బాస్ డీ లీడే(33), కొలిన్ అకెర్‌మన్(23)లు ధాటిగా ఆడారు. కానీ. దూబే ఓవర్లో లీడే ఔట్ కాగా.. అకెర్‌మన్‌ను చక్రవర్తి డౌగట్ పంపాడు. దాంతో.. 94కే నాలుగు వికెట్లు కోల్పోయిన డచ్ జట్టు.. ఇన్నింగ్స్ 120లోపే ముగిస్తుందనిపించింది. కానీ.. ఆఖర్లో జాజ్ లయన్ (26), నోహ్ క్రొయెస్(25 నాటౌట్) బౌండరీలతో చెలరేగి ఓటమి అంతరాన్ని తగ్గించారు.

#### దూబే, పాండ్యా ధనాధన్

అహ్మదాబాద్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ(0) డకౌటైనా.. శివం దూబే(66) శివాలూగిపోయాడు. టాపార్డర్ విఫలమైనా నేనున్నానుగా అంటూ అర్ధ శతకంతో విరుచుకుపడిన ఈ చిచ్చరపిడుగు భారీ స్కోర్ అందించాడు. తిలక్ వర్మ,(31), సూర్యకుమార్ యాదవ్(34) మెరుపులను కొనసాగించిన దూబే.. నెదర్లాండ్స్ బౌలర్లను బెంబేలెత్తించాడు. హార్దిక్ పాండ్యా(30)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన దూబే.. ఈ టోర్నీలో రెండో హాఫ్ సెంచరీ సాధించాడు. డెత్ ఓవర్లలో దూబే, పాండ్యా మరింత చెలరేగడంతో ప్రత్యర్థికి టీమిండియా 194 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

### ఫర్హాన్ సూపర్ సెంచరీ



**కొలంబో:** సూపర్-8కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పరిస్థితుల్లో పాక్ సమష్టి ప్రదర్శనతో ఆకట్టుకుంది. బుధవారం నమీబియాతో జరిగిన పోరులో పాక్ 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. పాక్ ఓపెనర్ ఫర్హాన్(58 బంతుల్లో 100 నాటౌట్, 11ఫోర్లు, 4సిక్సలు) సూపర్ సెంచరీతో చెలరేగిన వేళ 20 ఓవర్లలో 199/3 స్కోరు చేసింది. మరో ఓపెనర్ ఆయూబ్(14) నిరాశపరిచినా ఫర్హాన్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో పాక్‌కు భారీ స్కోరు అందించడంలో కీలకమయ్యాడు. పసలేని నమీబియా బౌలింగ్‌ను సులువుగా ఎదుర్కొంటూ సాధికారిక ఇన్నింగ్స్ నిర్మించాడు. 57 బంతుల్లో సెంచరీ ఖాతాలో వేసుకున్న ఫర్హాన్. నాలుగో వికెట్‌కు షాదాబ్‌ఖాన్(36నాటౌట్ )తో కలిసి 81 పరుగుల అజేయ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. ఛేదనలో నమీబియా.. ఉస్మాన్ తారీఖ్(4/16), షాదాబ్‌ఖాన్(3/19) ధాటికి 17.3 ఓవర్లలో 97 పరుగులకు కుప్పకూలింది.

## స్పోర్ట్స్

### శ్రీలంకకు ఊహించని షాక్.. వరల్డ్‌కప్ నుంచి యార్కర్ కింగ్ ఔట్..!



పొట్టి ప్రపంచకప్‌లో నాకౌట్ దశకు సమయం దగ్గర పడింది. లీగ్ దశలో మాదిరిగానే సూపర్ 8లోనూ అదరగొట్టాలని పట్టుదలతో ఉన్నాయి. అంతలోనే శ్రీలంకకు ఊహించని షాక్ తగిలింది. ఇప్పటికే ప్రధాన పేసర్ ఇషాన్ మలింగ, స్పిన్నర్ వనిందు హసరంగ సేవల్ని కోల్పోయిన లంక.. నాకౌట్ దశకు ముందే యువ పేసర్ మథీశ పథిరన సేవల్ని కోల్పోనుంది. కాలి పిక్క కండరాలతో బాధ పడుతున్న పథిరన టోర్నీ నుంచి వైదొలిగాడని బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ తెలిపాడు.

గ్రూప్ బీలోని శ్రీలంక లీగ్ దశ మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియాతో తలపడింది. ఈ మ్యాచ్‌లోనే పథిరన ఎడమ కాలి నొప్పితో బాధపడ్డాడు. నాలుగు బంతులు వేసిన తర్వాత అతడు కాలు పట్టుకొని విలవిలలాడాడు. ఫిజియో వచ్చి పరీక్షించినా ఉపశనమం లేకపోవడంతో మైదానం వీడాడు. ఆ తర్వాత అతడు బౌలింగ్‌కు రాలేదు. దాంతో.. గాయం తీవ్రత పెద్దదే అనుకున్నారంతా. అనుకున్నట్టే.. పథిరన వరల్డ్‌కప్‌లో కీలక మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. గురువారం జింబాబ్వేతో మ్యాచ్ ఉన్నందున బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోడ్ మాట్లాడుతూ పథిరన ఆరోగ్యంపై అప్‌డేట్ ఇచ్చాడు.

'ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో గాయపడిన పథిరన ఇంకా కోలుకోలేదు. టోర్నమెంట్‌లో తదుపరి మ్యాచ్‌లు ఆడేందుకు అతడు ఫిట్‌గా లేదు. వరల్డ్‌కప్ నుంచి పథిరన వైదొలిగాడని అధికారికంగా ప్రకటించలేదు. త్వరలోనే శ్రీలంక క్రికెట్ ఈ విషయాన్ని వెల్లడిస్తుంది. ప్రస్తుతానికైతే అతడి స్థానంలో ఎవరిని తీసుకోవాలి? అనేది ఇంకా నిర్ణయించలేదు' అని విక్రమ్ రాథోడ్ పేర్కొన్నాడు. యార్కర్లతో వికెట్లు పడగొట్టే పథిరన నాకౌట్ మ్యాచ్‌లకు దూరమవ్వడం ఆతిథ్య జట్టుకు పెద్ద లోటే. సూపర్ 8లో న్యూజిలాండ్, ఇంగ్లండ్, పాకిస్థాన్‌తో లంక తలపడనుంది.

# ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఒకప్పటి హీరోయిన్ కూతురు

దక్షిణాది వెండితెరపై ఒకప్పుడు ఓ వెలుగు వెలిగి ఎంతో మంది అభిమానులను సొంతం చేసుకున్న సీనియర్ నటి ఖుష్బూ వారసురాలు అవంతిక సుందర్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇవ్వనుంది. 'ఆరంభం' అనే మలయాళ చిత్రంతో తన సినీ ప్రయాణాన్ని స్టార్ట్ చేస్తుంది ఈ బ్యూటీ. సుజేష్ అన్నీ ఈపెన్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆమె 'ఆరతి' అనే పాత్రలో కనిపించనుంది. ఇక ఖుష్బూ కూడా మలయాళ సినిమాతోనే తన సినీ ప్రయాణాన్ని స్టార్ట్ చెయ్యగా.. కూతురు అవంతిక సుందర్ కూడా మంచి విజయాన్ని అందుకుని హీరోయిన్‌గా ఎదగాలని ఆశిస్తున్నారు అభిమానులు. కాగా.. 'ఆరంభం' చిత్రంలో సరిత, ఇంద్రన్స్, విజయరాఘవన్ వంటి దిగ్గజ నటీనటులు కూడా నటిస్తుండటంతో అవంతికకు ఇదొక మంచి ఆఫర్‌గా చెబుతున్నారు నెటిజన్లు.






# క్లైమాక్స్‌కి ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి

అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్‌గా.. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'బుకీ'. గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన ఈ యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ఇప్పటికే తమిల్‌లో విడుదలై బ్లాక్ బస్టర్ రెస్పాన్స్‌ని అందుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించగా మూవీ ప్రజెంటర్, మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ ఆంటోనీ మాట్లాడుతూ.. 'ఈ వేడుకకు మంచు లక్ష్మి రావడం చాలా ఆనందంగా ఉంది. వారితో కలిసి మరిన్ని చిత్రాలు చేయాలని కోరుకుంటున్నాను. గణేష్ అద్భుతమైన డిఓపీ, దర్శకుడు. ఈ సినిమా మ్యాసీవ్ హైబడ్జెట్ మూవీలా కనిపించదానికి కారణం కూడా తన విజన్. ఈ సినిమా తర్వాత కచ్చితంగా మీరందరూ ఆయన్ని సపోర్ట్ చేస్తారు. బుకీ కూడా తన నటనతో మీ అందరినీ అలరిస్తుంది. తెలుగు ఆడియన్స్ ఒక మంచి టాలెంట్‌ని సపోర్ట్ చేస్తారు. తనని కూడా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. ఈ సినిమా క్లైమాక్స్ చూస్తున్నప్పుడు ఖచ్చితంగా కన్నీళ్లు వస్తాయి. అంతా రిలేట్ చేసుకునేలా ఉంటుంది. చాలా మంచి సినిమా. ఫిబ్రవరి 20న థియేటర్స్‌లో చూసి తప్పకుండా మీరందరూ సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను' అన్నారు. యాక్ట్రెస్ మంచు లక్ష్మి మాట్లాడుతూ.. 'గత శుక్రవారం ఈ సినిమా తమిళ్లో రిలీజ్ అయ్యి అద్భుతమైన రెస్పాన్స్‌ని అందుకుంది. ఇది యూనివర్సల్‌గా కరెక్ట్ అయ్యే సినిమా అజయ్ ధనుషా ఇలా మంచి టీం తో కలిసి చేసిన సినిమా ఇది. విజయ్ ఒక సినిమాకి మ్యూజిక్ ఇస్తున్నారంటే ఆ కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. డైరెక్టర్ గణేష్‌కి చాలా మంచి ఫ్యూచర్ ఉంటుంది. ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన క్యారెక్టర్ చేశాను. ఇందులో క్యారెక్టర్ ఎక్స్‌ప్రెషన్స్ చాలా గమ్మత్తుగా ఉంటాయి. ఈ సినిమా తమిళ్లో అద్భుతమైన పేరు సంపాదించుకుంది. ఇది యూత్ ఫుల్ సినిమా. తెలుగులో కూడా సినిమా మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను' అన్నారు.

# చూసే వాళ్లకు చిన్నది కావచ్చు

ఇండస్ట్రీకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే మంచి క్రేజ్ తెచ్చుకున్న హీరోయిన్స్‌లో మలయాళ తార మమితాబైజు ఒకరు. 'ప్రేమలు'తో ఒక్కసారిగా ఫేమస్ అయిన మమితా.. ప్రస్తుతం కోలీవుడ్, టాలీవుడ్, మాలీవుడ్‌లో ఆఫర్లు అందుకుంటోంది. ఇందులో భాగంగానే ప్రజెంట్ కోలీవుడ్ స్టార్ సూర్యతో ఓ సినిమా చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని సూర్యపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'సూర్య, నేను 'సూర్య46' షూటింగ్‌లో చాలా సరదాగా గడిపాం. సూర్య సార్ ఎప్పుడూ స్పెషల్ కాఫీ తాగుతుంటారు. అది చాలా చాలా బాగుంటుంది. నేను ఆయన అసిస్టెంట్లను ఏ కాఫీ తాగుతున్నారో అడిగేదాన్ని. ఒకసారి నేను అడిగడం చూసిన సూర్య షూటింగ్ పూర్తయ్యే వరకు ప్రతిరోజూ ఆ కాఫీ నేను కూడా తాగేలా చూసుకున్నారు. ఇది చిన్న విషయమే కావచ్చు కానీ నాకు చాలా పెద్ద విషయం' అని తెలిపింది. కాగా.. సూర్య, మమితా జంటగా నటిస్తున్న చిత్రం 'సూర్య46'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రాబోతున్న ఒక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు జి.వి. ప్రకాష్ సంగీతం అందిస్తుండగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. 2026 జూలైలో రిలీజ్‌కు సిద్ధం అవుతున్నది.



Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com